


మహామ్మాయిదేవీ ఆలయ వార్షికోత్సవం

ఎల్లారెడ్డిపేట, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అల్మాస్‌పూర్ గ్రామంలోని మహామ్మాయిదేవీ ఆలయ వార్షికోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. విశ్వబ్రహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఉదయం ఆలయంలో వివిధ పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ప్యాక్స్ చైర్మన్ కృష్ణారెడ్డి, తాజా, మాజీ ఎంపీపీ రేణుక, వివిధ పార్టీల నాయకులు నర్సయ్య, లక్ష్మారెడ్డి, రాంరెడ్డి, సురేశ్, బాలయ్య, బాల్‌రెడ్డి, శ్రీనివాస్, కిషన్, నర్సింలు దేవీని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు అన్నదానం చేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

పల్లె పోరుకు మోగిన నగారా



(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

పల్లె ఎన్నికల పోరు నగారా మోగింది. ఎన్నికల కోడ్ అమలుల్లోకి వచ్చింది. రాష్ట్ర ఎన్నికల సంఘం పంచాయతీ ఎన్నికల నిర్వహణకు షెడ్యూల్ ప్రకటించడంతో రాజన్న సిరిసిల్ల జిల్లాలో పల్లెలో రాజకీయ వేడి మొదలైంది. రిజర్వేషన్ల ఖరారుతోనే ఆశావహులు గెలుపు కోసం ఎవరి ప్రయత్నాలు వారు మొదలుపెట్టారు. మంగళవారం ఎన్నికల సంఘం జారీ చేసిన షెడ్యూల్ ప్రకారం జిల్లాలో మూడు విడతల్లో గ్రామపంచాయతీ ఎన్నికల నిర్వహణ జరగనుంది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు పోలింగ్ వెంటనే ఓట్ల లెక్కింపుతో ఫలితాలు ప్రకటించనున్నారు. జిల్లాలోని 260 గ్రామ సర్పంచ్‌లు స్థానాలకు 2268 వార్డులకు సంబంధించిన వాటిలో మొదటి విడతలో ఐదు మండలాలు 85 సర్పంచ్‌లు, 748 వార్డు సభ్యులు, రెండవ విడతలో మూడు మండలాలు 88 సర్పంచ్‌లు, 758 వార్డు సభ్యులు, మూడవ విడతలో నాలుగు మండలాలు 87 సర్పంచ్‌లు, 762 వార్డు సభ్యులు ఎన్నికలు నిర్వహిస్తారు.

ఇందుకోసం మొదటి విడత నవంబరు 27 నుంచి 29 వరకు నామిషన్ల స్వీకరణ, డిసెంబరు 11న పోలింగ్, ఫలితాలు, రెండో విడత నవంబర్ 30 నుంచి డిసెంబరు 2 వరకు నామినేషన్ల స్వీకరణ, డిసెంబరు 14 పోలింగ్, ఫలితాలు, మూడవ విడత డిసెంబరు 3 నుంచి 5 వరకు నామినేషన్ల స్వీకరణ, డిసెంబరు 17 పోలింగ్, ఫలితాలు వెల్లడిస్తారు. జిల్లాలో 260 సర్పంచులు, 2268 వార్డుసభ్యుల స్థానాలు ఉండగా తాజా రిజర్వేషన్ల ప్రకారం సర్పంచ్‌ల్లో 56 బీసీలకు రిజర్వ్ చేశారు.

ఇందులో మహిళకు 24 స్థానాలు, జనరల్‌గా 32 స్థానాలు ఉన్నాయి. వంద శాతం ఎస్టీ పంచాయతీలు 26 ఉండగా 11 మహిళలకు, 15 జనరల్‌కు కేటాయించారు. మిగతా నాలుగు ఎస్టీ స్థానాల్లో రెండు మహిళలు, రెండు జనరల్‌గా ఉన్నాయి. ఎస్సీలకు 53 స్థానాలు కేటాయించగా 24 మహిళలకు, 29 జనరల్‌గా ఉన్నాయి. జనరల్ స్థానాలు 121 ఉండగా 58 మహిళకు, 63 జనరల్ స్థానాలుగా కేటాయించారు. 2268 వార్డుల్లో వందశాతం ఎస్టీ పంచాయతీల్లో 176 వార్డులు ఉండగా 88 మహిళకు, 88 జనరల్, ఇతర 53 ఎస్టీ వార్డుల్లో 18 మహిళలకు, 35 జనరల్‌గా కేటాయించారు. 442 ఎస్సీ వార్డులలో177 మహిళకు, 26 జనరల్‌గా ఉన్నాయి. 553బీసీ వార్డుల్లో 222 మహిళకు, 331 జనరల్ స్థానాలుగా ఉన్నాయి. 1044 జనరల్ వార్డుల్లో471 మహిళలకు, 573 జనరల్‌గా ఉన్నాయి.

జిల్లాలో 3.53 లక్షల మంది ఓటర్లు

రాజన్న సిరిసిల్ల జిల్లాలో 260 గ్రామపంచాయతీలో తుది ఓటర్ జాబితా ప్రకారం 3 లక్షల 53 వేల 351మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుషులు 170 1772 మంది, మహిళలు 182559 మంది ఉన్నారు. వీళ్లలో అధికంగా 11787 మంది మహిళలు పురుషుల కంటే ఎక్కువగా ఉన్నారు. జిల్లాలో 260 గ్రామ పంచాయతీలు, 2268 వార్డు సభ్యులు ఉండగా, 1734 పోలింగ్ కేంద్రాలు సిద్ధం చేశారు. గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి 200 మంది ఓటర్లు ఉన్నవరకు 1734 పోలింగ్ కేంద్రాలు, 400 ఓటర్ల వరకు 468 పోలింగ్ కేంద్రాలు, 650 ఓటర్ల వరకు ఉన్న పంచాయతీల్లో 76 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. పంచాయతీ ఎన్నికల్లో 650 మంది ఓటర్లకు ఒక పోలింగ్ కేంద్రాన్ని సిద్ధం చేస్తున్నారు. అంతకుమించి ఓటర్లు ఉంటే రెండవ పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేస్తారు. 200 మంది ఓటర్లు ఉన్న చోట ఒక ప్రిసైడింగ్ అధికారి ఒక పోలింగ్ అధికారి ఉంటారు. 201 నుంచి 400 వరకు ఒక ప్రిసైడింగ్ అధికారి ఇద్దరు పోలింగ్ అధికారులు, 401 నుంచి 650 వరకు ఉంటే ప్రిసైడింగ్ అధికారితో పాటు ముగ్గురు పోలింగ్ అధికారులను నియమించారు. జిల్లాలో ఎన్నికల

మిగతా 8లో

ఎన్నికల కోడ్ అమల్లోకి...

పంచాయతీ ఎన్నికల షెడ్యూల్ జారీ కావడంతోనే ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. పరిమితికి మించి డబ్బులు తీసుకొని వెళ్లడంలో ఇబ్బందులు ఏర్పడనున్నాయి. పరిమితికి మించి డబ్బులు ఉంటే లెక్కలు చెప్పాల్సిందే. అభివృద్ధి పనులు మొత్తంగా వాయిదా పడనున్నాయి. అసెంబ్లీ ఎన్నికల కోడ్ నియమావళి పంచాయతీ ఎన్నికల్లో కూడా యథావిధిగా ఉంటుంది.

పంచాయతీ ఎన్నికల షెడ్యూల్

విడత	మండలాలు	షెడ్యూల్
మొదటి విడత డిసెంబరు 11	రుద్రంగి - 10 పంచాయతీలు వేములవాడ - 11 పంచాయతీలు వేములవాడరూరల్ - 17 పంచాయతీలు కోనరావుపేట - 28 పంచాయతీలు చందుర్తి - 19 పంచాయతీలు మొత్తం 85 పంచాయతీలు, 748 వార్డులు	నోటిఫికేషన్ : నవంబరు 27 నామినేషన్ : నవంబరు 27 నుంచి 29 నామినేషన్ల పరిశీలన : నవంబరు 30 ఉపసంహరణ గడువు : డిసెంబరు 3 పోలింగ్ : డిసెంబరు 11 (సమయం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 1 వరకు)
రెండో విడత డిసెంబరు 14	బోయిన్‌పల్లి -23 పంచాయతీలు ఇల్లంతకుంట -35 పంచాయతీలు తంగళ్లపల్లి -30 పంచాయతీలు మొత్తం 88 పంచాయతీలు,758వార్డులు	నోటిఫికేషన్ : నవంబరు 30 నామినేషన్ : నవంబరు 30 నుంచి డిసెంబరు 2 నామినేషన్ల పరిశీలన : డిసెంబరు 3 ఉపసంహరణ గడువు : డిసెంబరు 6 పోలింగ్ : డిసెంబరు 14 (సమయం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 1 వరకు)
మూడో విడత డిసెంబరు 17	ఎల్లారెడ్డిపేట - 26 పంచాయతీలు వీర్నపల్లి - 17 పంచాయతీలు ముస్తాబాద్ - 22 పంచాయతీలు గంభీరావుపేట - 22 పంచాయతీలు మొత్తం 87 పంచాయతీలు, 762 వార్డులు	నోటిఫికేషన్ : డిసెంబరు 3 నామినేషన్ : డిసెంబరు 3 నుంచి 5 నామినేషన్ల పరిశీలన : డిసెంబరు 6 ఉపసంహరణ గడువు : డిసెంబరు 9 పోలింగ్ : డిసెంబరు 17 (సమయం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 1 వరకు)

అభివృద్ధి పనుల పరిశీలించిన విప్, ఇన్‌చార్జి కలెక్టర్



డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న విప్, కలెక్టర్

వేములవాడ, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): వేములవాడలో జరుగుతున్న అభివృద్ధి పనుల పురోగతిని మంగళవారం ఇన్‌చార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్‌తో కలిసి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పరిశీలించారు. ఈ సందర్భంగా పట్టణంలోని ఆర్టీసీ డిపో సమీపంలో నిర్మిస్తున్న డబుల్ బెడ్రూం ఇళ్లను పరిశీలించారు. మొత్తం రూ.5కోట్ల 61 లక్షల వ్యయంతో 144 ఇళ్లు నిర్మిస్తున్నామని అధికారులు విప్ కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. మూలవాగు బ్రిడ్జిపై నిర్మిస్తున్న బ్రిడ్జి పనులను పరిశీలించారు. వాగులో ప్రస్తుతం నడుస్తున్న ఫైల్స్ పనులను దగ్గరుండి తెలుసుకున్నారు. అక్కడి నుంచి అమ రవీరుల స్తూపం నుంచి రాజన్న ఆలయం వరకు చేపడుతున్న 80 ఫీట్ల రోడ్డు పనులు, కొనసాగుతున్న డ్రైనేజీ పనులను పరిశీలించి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. కాగా, డబుల్ బెడ్రూం ఇళ్ల పనులు పరిశీలిస్తున్న సమయంలో బేస్మెంట్ ఫ్లోరింగ్ ఒక్కసారిగా కుంగడంతో ప్రభుత్వ విప్, ఇన్‌చార్జి కలెక్టర్‌లు కింద పడబోయారు. అక్కడే ఉన్న నాయకులు వారిని కిందపడకుండా పట్టుకున్నారు. ఈ ఘటనతో ఒక్కసారిగా అందరు అవాక్కయ్యారు. అనంతరం వారు అక్కడి నుంచి వెళ్లిపోయారు. వెంట ఆర్డీవో రాధాబాయి, కమిషనర్ అన్వేష్, తహసీల్దార్ విజయ ప్రకాశ్‌రావు తదితరలు ఉన్నారు.

ఫ్లోరింగ్ కుంగిన ఘటనపై విచారణకు ఆదేశాలు..

వేములవాడ, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): వేములవాడ పట్టణంలోని ఆర్టీసీ డిపో వద్ద నిర్మాణంలో ఉన్న డబుల్‌బెడ్రూం పనుల పరిశీలనలో భాగంగా బేస్మెంట్ ఫ్లోరింగ్ కుంగిన ఘటనపై విచారణకు ఆదేశించినట్లు గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ శంకర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్, ఇన్‌చార్జి కలెక్టర్ గరిమా అగ్రవాల్ సంబంధిత అధికారులతో నిర్మాణంలో ఉన్న 144 డబుల్ బెడ్రూం ఇళ్లు జీ ప్లస్-2తో 12 బ్లాకులు సందర్శించారని తెలిపారు. 2019లో పనులు ప్రారంభమై 2021 వరకు కొనసాగాయన్నారు. ఇళ్లను తిరిగి నిర్మించడానికి ట్రాన్స్‌పోర్ట్, రహదారులు, భవనాల శాఖ ఆధ్వర్యంలో సూపరింటెండెంట్ ఇంజనీర్ నూతన ఏజెన్సీకి అప్పగించారు. నిర్మాణ పనులు గడువులోగా పూర్తి చేయడానికి అనుకూల పరిస్థితులను క్షేత్రస్థాయిలో పరిశీలించడానికి ప్రభుత్వ విప్, కలెక్టర్ సందర్శించారన్నారు. ఒక బ్లాక్‌లోని గ్రౌండ్ ఫ్లోర్ కుంగిందని, ఎవరికి ఎలాంటి గాయాలు, అపాయం జరగలేదని తెలిపారు. ఈ సంఘటనపై పూర్తి స్థాయిలో విచారణ నిమిత్తం అధికారుల బృందాన్ని పంపించామని, నివేదిక అందిన వెంటనే ఉన్నతాధికారులకు ఆదేశాల నిమిత్తం సమర్పించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

గత ప్రభుత్వం హయాంలో నాసిరకం కట్టడాలు

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

సిరిసిల్ల, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): గతప్రభుత్వం హయాంలో నాసిరకం కట్టడాలు కట్టి అడ్డగోలుగా సంపాదించారని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. మంగళవారం వేములవాడలో ఇన్‌చార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్‌తో కలసి గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మొదలుపెట్టిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తుండగా కూలిన ఫ్లోరింగ్‌పై ఆది శ్రీనివాస్ స్పందించారు. కలెక్టరేట్ వద్ద ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ పాలనలో కేవలం డబ్బు దోచుకోవడం కోసమే పనులు చేశారని, ప్రజలపై ప్రేమతో మాత్రం కాదన్నారు. గతంలో మేం చేసిన ఆరోపణలు ఇప్పుడు నిజం అయ్యాయన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నాణ్యత లేని పనులు చేపడుతున్నరని చాలాసార్లు చెప్పామని, ఎన్నోసార్లు ఆందోళనలు చేశామన్నారు. దానికి నిదర్శనంగా నిర్మాణాలు పరిశీలిస్తుండగా బేస్ కూలిపోయిందన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో అనేక నాణ్యతలేని కట్టడాలు కట్టారన్నారు. కమిషన్ల కోసం నాసిరకంగా కట్టడాలు నిర్మించి అక్రమార్జనకు తెరలేపారన్నారు. వారు కట్టిన కాళేశ్వరం కూలిపోయిందని, డబుల్ బెడ్ రూమ్ బేస్‌మెంట్ కూలిపోయిందన్నారు. కలెక్టర్‌తో కలిసి వెళ్లి పరిశీలిస్తున్న సమయంలో బేస్మెంట్ ఫ్లోరింగ్ కూలిపోయిందన్నారు. ప్రజా ప్రభుత్వంలో వాటిని తొలగించి నూతన కట్టడాల నిర్మాణం చేపడుతామన్నారు. తామే కాదు స్వంత ఇంట్లో కేటీఆర్ చెల్లెలు కవిత కూడా అన్నదని, తెలంగాణ రాష్ట్రం బంగారు తెలంగాణ కాలేదని, కేవలం కేటీఆర్, హరీష్‌రావు కేసీఆర్ ఇళ్లు మాత్రమే బంగారం అయ్యిందని, కవిత వెళ్లిన ప్రతిచోట అవే ఆరోపణలు చేస్తున్నారన్నారు. కవిత వేములవాడలో కూలిపోయిన వాటిపై స్పందిస్తుందని అనుకుంటున్నాన్నారు. గత ప్రభుత్వంలో కట్టిన ప్రాజెక్టులు ఇంకా ఎన్ని కూలుతాయో చూడాలన్నారు. గతంలో బీఆర్ఎస్ హయంలో కట్టిన వేములవాడ బ్రిడ్జి కూడా కూలిపోయిందని ప్రజా ప్రభుత్వంలో బ్రిడ్జి నిర్మాణం చేపడుతున్నారు. ఆయన వెంట గ్రంథాలయ చైర్మన్ నాగుల శ్రీనివాస్,జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

భీమన్న సన్నిధిలో విప్, ఇన్‌చార్జి కలెక్టర్ పూజలు



ఆలయంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న విప్ ఆది శ్రీనివాస్, ఇన్‌చార్జి కలెక్టర్ గరిమా అగ్రవాల్

వేములవాడ టౌన్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): వేములవాడ భీమేశ్వరస్వామి ఆలయంలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఇన్‌చార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. విప్, ఇన్‌చార్జి కలెక్టర్‌లు కోడె మొక్కులు చెల్లించారు. భీమన్న ఆలయంలో స్వామివారికి నివేదన జరుగుతున్న సందర్భంగా అరగంటసేపు నిరీక్షించారు. అనంతరం భీమన్న స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ మండ పంలో వారికి వేదపండితులు ఆశీర్వచనం ఇవ్వగా, ఈవో రమాదేవి శేషవస్త్రం కప్పి ప్రసాదం అందజేశారు.

భీమన్న సన్నిధిలో ఏర్పాట్ల పరిశీలన

భీమేశ్వరస్వామి దేవస్థానంలో భక్తుల కోసం చేపట్టిన ఏర్పాట్లను ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఇన్‌చార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ పరిశీలించారు. కోడెల క్యూలైన్, ఉచిత దర్శనం, అభిషేకం క్యూలైన్‌లను పరిశీలించారు. కల్యాణకట్టలో పరిశీలించి వేడినీరు తదితర సౌకర్యాలపై భక్తులను అడిగి తెలుసుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో రాధాబాయి, ఆలయ ఈవో రమాదేవి, డీఈ రఘునందన్, మార్కెట్ కమిటీ చైర్మెన్ రొండి రాజు, కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్ గౌడ్, కట్కూరి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

టెట్ ఉత్తీర్ణత నిబంధనను సవరించాలి

ఎల్లారెడ్డిపేట, నవంబరు25(ఆంధ్రజ్యోతి): ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ ఉత్తీర్ణత నిబంధనను ప్రభుత్వం సవరించాలని తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు కృష్ణప్రసాద్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆ సంఘం 80 వసంతాల విద్యా సదస్సుకు సంబంధించిన పోస్టర్లను మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కృష్ణప్రసాద్ మాట్లాడుతూ డిసెంబర్ 21న హైదరాబాద్‌లో తలపెట్టిన విద్యా సదస్సును విజయవంతం చేయాలని కోరారు. హెచ్ఎం మనోహరచారి, సంఘం బాధ్యులు రమేశ్‌నాయక్, ప్రవీణ్‌కుమార్, విష్ణు, రాజు, రవీందర్, మల్లారెడ్డి, లక్ష్మీనారాయణ, చిరంజీవి, శ్రీధర్, దేవదాస్, తుకారాం, వైదేహి, సువర్ణ, రాణి తదితరులు పాల్గొన్నారు.

మహిళలను కోటీశ్వరులుగా చేయడమే ప్రభుత్వ లక్ష్యం

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ - జిల్లాలో రూ 8.12 కోట్లు వడ్డీ లేని రుణాలు పంపిణీ

సిరిసిల్ల, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి):ఇందిరా మహిళా శక్తి ద్వారా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాష్ట్రంలోని కోటి మంది మహిళలను కోటీశ్వరులు చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో జిల్లాలోని 8871 ఎస్‌హెచ్‌జీలకు రూ 8.12 కోట్ల రుణాల చెక్కులను ఇన్‌చార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ మహిళలు ఆకాశమే హద్దుగా ముందుకు వెళ్లాలని కోరారు. ఇప్పటి వరకు మూడు విడతల్లో ఎస్‌హెచ్‌జీలకు వడ్డీ రుణాలు పంపిణీ చేశామని తెలిపారు. జిల్లాలోని స్వయం సహాయక మహిళా సంఘాలు దాదాపు రూ 8.12 కోట్లు లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాల్లో జమ అయ్యాయని వెల్లడించారు. ప్రజా ప్రభుత్వం మొదటి విడతలో 7802 ఎస్‌హెచ్‌జీలకు రూ 7.40 కోట్లు, రెండో విడతలో 8552 ఎస్‌హెచ్‌జీలకు రూ 11.78 కోట్లు వడ్డీలేని రుణాలు పంపిణీ చేసిందన్నారు. జిల్లాలో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు ఇప్పటి వరకు రూ 100.10 కోట్లు ఆర్థిక సహాయం ప్రభుత్వం అందించిందన్నారు. ఇన్‌చార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా వృద్ధి చెంది ఉన్నత స్థానాలకు ఎదగాలన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ నాగుల సత్యనారాయణ గౌడ్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్లు స్వరూపారెడ్డి, విజయ, సాబేరబేగం, రాణి, చైర్మన్ రాములునాయక్ తదితరులు పాల్గొన్నారు.



చెక్కును అందిస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్,కలెక్టర్ గరిమ అగ్రవాల్

ఎన్నికల విధులు సమర్థవంతంగా నిర్వహించాలి

- ఇన్‌చార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ - ఆర్‌వో, ఏఆర్‌వోలకు శిక్షణ

సిరిసిల్ల, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): గ్రామపంచాయతీ ఎన్నికల విధులు సమర్థవంతంగా నిర్వహించాలని ఇన్‌చార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో గ్రామపంచాయతీ ఎన్నికల నిర్వహణపై రిటర్నింగ్ ఆఫీసర్ (ఆర్‌ఓ), అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్(ఏఆర్‌ఓ)లకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇన్‌చార్జి కలెక్టర్ మాట్లాడుతూ సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలకు నామినేషన్ స్వీకరణ, పరిశీలన, స్క్రూటినీ,అప్పీళ్ల పరిష్కారం, గుర్తుల కేటాయింపు, పోటీ చేసే అభ్యర్థుల ప్రకటన పకడ్బందీగా జరిగేలా మార్గదర్శకాల ప్రకారం చేయాలని సూచించారు. శిక్షణలో డీపీవో శర్ఫుద్దిన్, అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఇన్‌చార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్

నిష్పక్షపాతంగా విధులు నిర్వర్తించాలి

- ఇన్‌చార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్

గ్రామ పంచాయితీ ఎన్నికల్లో అధికారులు నిష్పక్షపాతంగా విధులు నిర్వర్తించాలని జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. గ్రామ పంచాయతీ ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్(ఎంసీసీ)పై వివిధ శాఖల జిల్లా అధికారులతో మంగళవారం కలెక్టరేట్‌లో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో రాజకీయ పార్టీల కార్యక్రమాల్లో అధికారులు, సిబ్బంది పాల్గొనకూడదని స్పష్టం చేశారు. విధుల్లో భాగంగా ఎఫ్ఎస్టీ, ఎస్ఎస్టీలు సీజ్ చేసినప్పుడు తప్పనిసరిగా వీడియో ఫుటేజ్ తీసుకోవాలని, ఏమాత్రం నిర్లక్ష్యం ప్రదర్శించవద్దని సూచించారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే కఠిన చర్యలు : ఎస్పీ

సిరిసిల్ల రూరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం, మద్యం మత్తులో వాహనాలు నడపడం వంటి చర్యలపై కఠినంగా వ్యవహరిస్తామని ఎస్పీ మహేష్ బీగీతే అన్నారు. సిరిసిల్ల జిల్లా పోలీస్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ మాట్లాడారు. జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించే ప్రాంతాలపై నిఘా ఉంచుతామన్నారు. ఇందులో భాగంగా ఈ సంవత్సర కాలంలో 3740 మంది కేసులు నమోదు చేశామన్నారు. బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించే ప్రదేశాలపై సమాచారం సేకరిస్తున్నామని దానికి అనుగుణంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ముఖ్యంగా రాత్రిసమయాల్లో లైటింగ్ తక్కువగా ఉండే ప్రాంతాలను గుర్తించి మరింత సమర్థవంతంగా పెట్రోలింగ్ నిర్వహిస్తున్నామన్నారు. గడిచిన ఏడు నెలల్లో జిల్లావ్యాప్తంగా మద్యం సేవించి వాహనాలు నడుపుతూ 10980 మంది పట్టుబడ్డారని, వారికి జరిమానాలు విధించడం జరిగిందన్నారు. ఇందులో 260 మందికి జైలు శిక్షలు విధించడం జరిగిందన్నారు. మద్యం సేవించి వాహనం నడిపి ప్రమాదాలకు కారణమైన వారిపై కేసులు నమోదు చేయడంతో పాటుగా కఠిన చర్యలు తీసుకుంటామని సూచించారు. మద్యం సేవించి పట్టుబడిన వారికి కౌన్సెలింగ్ నిర్వహిస్తూ ప్రజలలో అవగాహన కల్పిస్తున్నామని జిల్లా ఎస్పీ తెలిపారు.

పోస్టర్ ఆవిష్కరణ

సిరిసిల్ల టౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : 'హలో కళాకారులు... చలో కరీంనగర్ వాల్‌పోస్టర్‌ను మంగళవారం జిల్లా కేంద్రం ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ జానపద సకల వృత్తి కళాకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు సంధ్యగౌడ్, ప్రధానకార్యదర్శి సుభాష్ చంద్రబోష్ ఆవిష్కరించారు. సంఘం ఆధ్వర్యంలో కరీంనగర్ జిల్లా కేంద్రం కళాభారతిలో ఈనెల 28న ఉదయం 10 గంటలకు ఆవిర్భావ సదస్సు జరుగుతుందన్నారు. రాష్ట్రసంయుక్త కార్యదర్శి దాట్ల నిర్మల, కోశాధికారి ఎద్దు మమత, కళాకారుడు శ్రీధర్‌రెడ్డి, సామాజిక కార్యకర్త మార్కండేయులు, శ్రీకాంత్, సంతోష్, డివిజన్ నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

రైతు ఖాతాకు బదులు రాజన్న ఖజానాకు..

- పత్తి విక్రయించిన మహిళా రైతు..
- సాంకేతిక లోపం అని తేల్చిన అధికారులు
- ఇరవై రోజులకు రైతు ఖాతాలో జమ



సత్తమ్మ

వేములవాడ టౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): సీసీఐకి పత్తి విక్రయించిన రైతు ఖాతాలోకి కాకుండా వేములవాడ రాజరాజేశ్వరస్వామి దేవస్థానం ట్రస్టు ఖాతాలోకి డబ్బులు జమ అయ్యాయి. దీంతో బ్యాంకు, దేవస్థానం, మార్కెట్ యార్డు, సీసీఐ చుట్టూ తిరగడంతో చివరికి 20రోజులకు ఆమె ఖాతాలోకి డబ్బులు చేరాయి. వేములవాడ పట్టణంలోని గాంధీనగర్‌కు చెందిన ఏదుల సత్తమ్మకు ఆరు ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. ఇందులో నాలుగు ఎకరాల్లో కుమారుడు వెంకటేశ్ పత్తివేశాడు. ఈ పత్తిపంటలో పండిన పత్తిని ఈనెల 6న వేములవాడ పట్టణ పరిధిలోని నాంపల్లి లక్ష్మీనర్సింహ ఇండస్ట్రీస్‌లో ఏర్పాటుచేసిన సీసీఐ కొనుగోలు కేంద్రంలో 27క్వింటాళ్ల పత్తిని విక్రయించారు. వరంగల్ సీసీఐ ద్వారా 2,11,549 రూపాయలు సత్తమ్మ ఖాతాలో జమ అయినట్లు సెల్‌ఫోన్‌కు మెస్సెజ్ వచ్చింది. ఈనెల 11న వేములవాడ ఎస్‌బీఐ బ్రాంచికి వెళ్లి డబ్బులు డ్రా చేసేందుకు ప్రయత్నించగా ఖాతాలో డబ్బులు లేవని సిబ్బంది చెప్పారు. కుమారుడితో పాటు ఆమె బ్యాంకు మేనేజర్ సంపత్‌ను అడుగడంతో అసలు విషయం బయటపడింది. డబ్బులు రాజరాజేశ్వరస్వామి దేవస్థానం ట్రస్టు ఖాతాలోకి మళ్లాయి. ఆమె ఆధార్ లింకు దేవస్థానం ట్రస్టు ఖాతాకు లింకు అయి ఉంది. ఏడాదిగా వంట గ్రాస్ సబ్సిడీ డబ్బులు ఎస్ఆర్ఆర్ ట్రస్టు ఖాతాలోనే జమ అవుతున్నట్లు గుర్తించారు. సీసీఐ కొనుగోలు కేంద్రం ఇన్‌చార్జి అధికారి రఘురాంను కలిసి జరిగిన విషయాన్ని చెప్పడంతో వరంగల్‌లోని రీజినల్ కార్యాలయానికి లేఖ రాశారు. సాంకేతిక లోపంతో రైతు ఖాతాలోకి చేరాల్సిన డబ్బులు రాజరాజేశ్వరస్వామి దేవస్థానం ట్రస్టు ఖాతాలోకి వెళ్లాయని, ఈ డబ్బులు తిరిగి సీసీఐకి జమ చేయాలని వరంగల్ నుంచి ఈనెల 20న లేఖ వచ్చింది. ఆ తర్వాత రైతు, బ్యాంకు అధికారులు ఆలయ ఈవోను కలిసి సమస్య వివరించారు. ఎట్టకేలకు 2,11,549 రూపాయలు ట్రస్టు ఖాతా నుంచి రైతు ఖాతాకు మళ్లించారు. దీంతో ఆ మహిళా రైతు బ్యాంకు నుంచి మంగళవారం డబ్బులు డ్రా చేసుకొని ఊపిరి పీల్చుకుంది.

అడవి శ్రీరాంపూర్‌లో బెల్లం పానకం ధ్వంసం

ముత్తారం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ముత్తారం మండలంలోని అడవిశ్రీరాంపూర్ సమీపంలోని అటవీ ప్రాంతంలో మంథని ఎక్సైజ్ పోలీసులు మెరుపుదాడులు నిర్వహించారు. గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలో నాటు సారాయి తయారు చేస్తున్నారనే పక్కా సమాచారంతో మంథని ఎక్సైజ్ ఎస్ఐ సాయికుమార్ తన సిబ్బందితో దాడులు చేపట్టారు. అక్కడ నాటు సారాయికి తయారీగా ఉన్న సుమారు 300 లీటర్ల ఇప్ప పువ్వు, బెల్లం పానకాన్ని ధ్వంసం చేశారు. నిషేధిత గుడుంబా తయారు చేసిన, విక్రయించిన చట్టపరంగా చర్యలు తప్పవని హెచ్చరించారు. గుడుంబాపై ఎలాంటి సమాచారం ఉన్న పోలీసులకు అందించాలని సూచించారు. సిబ్బంది శ్రీనివాస్, రఘు, నిరంజన్, రవి పాల్గొన్నారు.

- వాట్సాప్ ద్వారా అందుబాటులోకి 20కి పైగా సర్వీసులు
- దరఖాస్తులకు మరింత సులభతరం
- సర్టిఫికెట్ సిద్ధం కాగానే డౌన్‌లోడ్ లింక్
- ప్రజలకు, విద్యార్థులకు తీరనున్న కష్టాలు



అరచేతిలో మీసేవ

ముత్తారం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు ఏదైనా అప్లై చేయాలంటే మీ సేవ చుట్టూ తిరగాల్సి వచ్చేది. ముఖ్యంగా పిల్లల చదువుల కోసం కులం, నివాసం, ఆదాయ సర్టిఫికెట్ కోసం మీ సేవల వద్ద గంటల తరబడి వేచి ఉండే పరిస్థితి ఉండేది. ఈ సమస్యలకు చెక్ పెడుతూ మీసేవ సర్వీసును ప్రజలకు మరింత చేరువ చేసేందుకు నేరుగా వాట్సాప్ ద్వారానే సేవలు పొందేలా ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. ఈ డిజిటల్ సేవలను ఈ నెల 18న మంత్రి శ్రీధర్ బాబు ప్రారంభించారు. ఇక నుంచి కేవలం వాట్సాప్‌లో మెసేజ్ పెడితే 20కి పైగా మీసేవ సర్వీసులను పొందవచ్చు. వాట్సాప్ 8096958096 నెంబర్‌కు హాయ్ అని మెసేజ్ చేస్తే చాలు వెంటనే రిప్లైలో మెనూ వస్తుంది. కావాల్సిన సేవలను ఎంచుకొని దరఖాస్తు చేసుకోవచ్చు. ఎప్పటికప్పుడు అప్డేట్‌తోపాటు ఆమోదం పొందిన సర్టిఫికేట్‌ను డౌన్ లోడ్ చేసుకునే సౌకర్యం కల్పించారు. ఈ మార్పుతో ప్రజలకు మరింత సులభంగా.. వేగంగా.. ప్రభుత్వ సేవలు అందుతాయని అధికారులంటున్నారు.

అందుబాటులో ఉండే సేవలు ఇవే...

ప్రస్తుతం 20 పైగా సేవలు వాట్సప్ ద్వారా అందుబాటులో ఉన్నాయి. మరిన్ని సేవలను చేర్చే పనిలో అధికారులు ఉన్నారు. ఇక ఫోన్ ద్వారానే ఆదాయం, నివాస ధ్రువీకరణ పత్రం, బర్త్, డెత్ సర్టిఫికెట్స్ దరఖాస్తు చేసుకొని డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. నల్లా, కరెంటు బిల్లులు, పోలీస్ చలాన్స్, ఆర్టీఏ లైఫ్ టాక్స్ చెల్లించ వచ్చు. ఇళ్ల నిర్మాణాలకు గ్రామ పంచాయతీ పర్మిషన్లు, పంచాయతీల్లో, మున్సిపాలిటీల్లో మ్యూటేషన్ దరఖాస్తులు, ఆస్తి పన్నులు చెల్లించుకోవచ్చు. దేవాలయాల సమాచారం, దైవ దర్శనాల స్లాట్ బుకింగ్, గదుల బుకింగ్, ఆన్‌లైన్ పూజా బుకింగ్ సౌలభ్యం ఇందులో ఉంది. రేషన్ కార్డుల జారీ, రిజిస్ట్రేషన్లకు స్లాట్ బుకింగ్, వ్యవసాయ మార్కెట్ ధరలు ఇలా పలు రకాల సేవలు అందుబాటులోకి వచ్చాయి.

● ఆన్‌లైన్‌లో నమోదు.. డౌన్‌లోడ్

అధికారిక నంబరుకు వాట్సాప్‌లో హాయ్ అని మెసేజ్ చేస్తే నమస్కారం.. తెలంగాణ మీసేవకు స్వాగతం. మీకు ఎలాంటి సేవలు కావాలంటూ రిప్లై వస్తుంది. అందుబాటులో ఉన్న సర్వీసుల మెనూ కనిపిస్తుంది. అందులో దరఖాస్తును ఎంచుకో వాలి. దరఖాస్తును పూరించి అవసరమైన డాక్యుమెంట్లు, ఫొటోలు స్కాన్ చేయాల్సి ఉంటుంది. సూచించిన ఫీజును యూపీఐ ద్వారా సుర క్షితంగా చెల్లించవచ్చు. ఆ తర్వాత దరఖాస్తు స్టేటస్, అప్డేట్స్, అన్ని వాట్సాప్ లోనే మెసేజ్ రూపంలో వస్తాయి. ఆన్‌లైన్‌లో అందిన దర ఖాస్తు పరిశీలించిన అధికారులు ధ్రువీకరణ పత్రాలను జారీ చేస్తారు. సర్టిఫికేట్ సిద్ధం కాగానే దాని డౌన్‌లోడ్ లింక్ ఫోన్‌కు వస్తుంది. దాన్ని క్లిక్ చేసి డౌన్‌లోడ్ చేసుకొని పీడీఎఫ్ రూపంలో సేవ్ చేసుకోవచ్చు. అవసరమైతే ప్రింట్ కూడా తీసుకొని వాడుకోవచ్చు.

కట్టుకున్నోడే కడతేర్చాడు

- ● భార్యపై పెట్రోల్ పోసి నిప్పంటించి సజీవదహనం
- ● వివరాలు వెల్లడించిన ఏసీపీ మాధవి



కేసు వివరాలు వెల్లడిస్తున్న హుజూరాబాద్ ఏసీపీ మాధవి

సైదాపూర్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాములపల్లి గ్రామానికి చెందిన చింతకుంట్ల సుకృతను ఆమె భర్త చింతకుంట్ల మహిపాల్‌రెడ్డి పథకం ప్రకారం తమ వ్యసాయ భూమి వద్ద పెట్రోల్ పోసి నిప్పంటించి సజీవ దహనం చేసినట్లు హుజూరాబాద్ ఏసీపీ మాధవి తెలిపారు. మంగళవారం సైదాపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేసు వివరాలు వెల్లడించారు. హుజూరాబాద్ మండలం తోకలపల్లి గ్రామానికి చెందిన సుకృతను 2000 సంవత్సరంలో రాములపల్లి గ్రామానికి చెందిన చింతకుంట్ల మహిపాల్‌రెడ్డికి ఇచ్చి వివాహం చేశారు. వీరికి ఒక కుమార్తె జన్మించింది. 2002లో మహిపాల్‌రెడ్డి అదే గ్రామానికి చెందిన మేకల విజయను ప్రేమ పేరుతో తీసుకెళ్లగా విజయ కుటుంబ సభ్యులు వారిని వరంగల్‌లో పట్టుకొని తీసుక రాగా విజయ ఆత్మహత్యా చేసుకొని మృతి చెందింది. సుకృత-మహిపాల్‌రెడ్డి మధ్య గొడవలు జరుగుతుండగా సుకృత గ్రామంలోనే ఓ ఇంట్లో కిరాయికి ఉంటోంది. 2009లో మహిపాల్‌రెడ్డి మళ్లీ రమాదేవి అనే మహిళను రెండో వివాహం చేసుకున్నాడు. దాంతో సుకృత మహిపాల్‌రెడ్డిపై వరకట్నం, రెండో వివాహంపై, మెయింటినెన్స్ కేసు వేసింది. చాలాసార్లు సుకృత మహిపాల్‌రెడ్డి మధ్య పంచాయతీలు జరిగాయి. చివరకు మహిపాల్‌రెడ్డి సుకృతకు 20 గుంటల భూమి ఇచ్చాడు. ఆ భూమిని సుకృత తన కుమార్తెకు రిజిస్ట్రేషన్ చేయడంతో మహిపాల్‌రెడ్డి సుకృతపై కోపం పెంచుకున్నాడు. సుకృతను చంపుతానని గతంలో చాలాసార్లు బెదిరించాడు. ఈ నెల 21న సైదాపూర్-హుజూరాబాద్ రోడ్డులోని జాగీర్‌పల్లి పెట్రోల్ బంకులో పెట్రోలు కొనుగోలు చేసి ముందుగానే రాములపల్లి శివారులోని తన వ్యవసాయ భూమి వద్ద తాటి కమ్మల కింద దాచి పెట్టాడు. ఈ నెల 22న మధ్యాహ్నం తమ వ్యవసాయ భూమి వద్ద సుకృత ఒంటరిగా వ్యవసాయ పనులు చేస్తుండగా మహిపాల్‌రెడ్డి సుకృతపై పెట్రోల్ పోసి నిప్పంటించి సజీవ దహనం చేసి పరారయ్యాడని తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు దర్యాప్తు చేసి మంగళవారం నిందితుడు మహిపాల్‌రెడ్డిని అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ మాధవి తెలిపారు. కార్యక్రమంలో హుజూరాబాద్ రూరల్ సీఐ పులి వెంకట్ తదితరులు పాల్గొన్నారు.



చంద్రశేఖరుడు

చంద్రుడిని శిరస్సుపై ధరించాడు కాబట్టి శివుడిని చంద్ర శేఖరుడు అని పిలుస్తారు. రాజన్న క్షేత్రమైన వేములవాడలో ఓ దృశ్యం అందరినీ ఆకట్టుకుంది. మున్సిపల్ పార్కులోని ఏర్పాటు చేసిన పరమశివుడి విగ్రహం శిరస్సుపై చంద్రుడు ఇలా కనిపించాడు. దీంతో అక్కడ ఉన్నవారు విగ్రహంపై ఇలా ఇద్దరు చంద్రులు కనిపిస్తున్నారని ఆశ్చర్యపోయారు. ఈ దృశ్యాన్ని పలువులు ఆసక్తిగా తిలకించారు.

- వేములవాడ, ఆంధ్రజ్యోతి

రామగుండానికి డబుల్ బొనాంజా

- క్యాబినెట్‌లో రెండు విద్యుత్ కేంద్రాలకు ఆమోదం
- 800మెగావాట్ల సూపర్ థర్మల్ విద్యుత్ కేంద్ర స్థాపన
- మేడిపల్లి ఓసీపీల్లో పంప్‌డ్ స్టోరేజీ ప్లాంట్

గోదావరిఖని, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): రామగుండానికి రాష్ట్ర ప్రభుత్వం డబుల్ బోనంజా ప్రకటించింది. మంగళవారం జరిగిన రాష్ట్ర క్యాబినెట్ సమావేశంలో రూ.17వేల కోట్ల పెట్టుబడులతో రెండు విద్యుత్ కేంద్రాల స్థాపనకు ఆమోద ముద్ర వేసింది. జీవిత కాలం ముగియడంతో మూతబడిన బీ థర్మల్ స్థానంలో ఎన్‌టీపీసీ సహకారంతో 800మెగావాట్ల సూపర్ క్రిటికల్ థర్మల్ పవర్ ప్లాంట్ నిర్మాణానికి రాష్ట్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. రూ.13వేల కోట్ల పెట్టుబడితో ఈ విద్యుత్ కేంద్రాన్ని నిర్మించనున్నారు. జెన్‌కో దగ్గర వనరులు అందుబాటులో లేకపోవడంతో ఎన్‌టీపీసీ సహకారంతో విద్యుత్ కేంద్రం నిర్మించాలని క్యాబినెట్ నిర్ణయించింది. ఎన్‌టీపీసీ యాజమాన్యం ఇటీవల రాష్ట్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరిపింది. రాష్ట్రంలో జాయింట్ వెంచర్‌లో కానీ, స్వతహాగా కానీ విద్యుత్ కేంద్రాల స్థాపనకు ఆసక్తి కనబరిచింది. ఈ పరిస్థితుల్లో రామగుండం బీ థర్మల్ స్థానంలో ఏర్పాటు చేయనున్న కొత్త విద్యుత్ కేం ద్రాన్ని ఎన్‌టీపీసీ సహకారంతో నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. గతంలో సింగరేణితో జాయింట్ వెంచర్ చేయాలని భావించినా ఇప్పుడు ఎన్‌టీపీసీ ముందుకు రావడంతో ఎన్‌టీపీసీని భాగస్వామ్యం చేయాలని నిర్ణయించారు. తద్వారా స్థానిక నిరుద్యోగులకు ఉపాధి కలగనున్నది. అలాగే రామగుండం పట్టణం పక్కనే ఉన్న మేడిపల్లి ఓసీపీలో సుమారు రూ.4వేల కోట్ల సింగరేణిలోనే మొదటిసారిగా పంప్‌డ్ స్టోరేజీ పవర్‌ప్లాంట్ నిర్మాణానికి కూడా క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ఈ పవర్‌ప్లాంట్ నిర్మాణం జరిగితే సింగరేణి సంస్థ భవిష్యత్‌లో మరిన్ని పంప్‌డ్ స్టోరేజీ పవర్ ప్లాంట్లు నిర్మించేందుకు మార్గం ఏర్పడుతుంది. ఈ రెండు భారీ ప్రాజెక్టులు రామగుండానికి రావడంతో స్థానికంగా హర్షం వ్యక్తం అవుతుంది. ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ రామగుండం పవర్ ప్లాంట్ ఏర్పాటుకు ఎన్నికల సమయంలో హామీ ఇచ్చారు. ఆ హామీని నెరవేర్చుకునేందుకు ముఖ్యమంత్రి, మంత్రులపై ఒత్తిడి చేస్తూ వచ్చారు. మంత్రి శ్రీధర్‌బాబు పరిశ్రమల శాఖ మంత్రిగా ఉండడంతోపాటు ప్రభుత్వంలో కీలకం కావడంతో ఈ ప్లాంట్ ప్రకటనకు పూర్తిగా సహకరించారు.

రామగుండానికి సీఎం ప్రాణం పోశారు...

- ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్



రామగుండంలో నిజాం హయాంలో విద్యుత్ కేంద్రాల స్థాపన జరిగింది. అవి జీవితకాలం ముగియడంతో మూతబడ్డాయి. ఇప్పుడు సీఎం రేవంత్‌రెడ్డి రామగుండానికి విద్యుత్ కేంద్రాలు మంజూరు చేసి ప్రాణం పోశారు. ప్రజల మనోభావాలు, సెంటిమెంట్లు, ఉపాధిని పరిగణలోకి తీసుకున్నారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సహకరించారు. జిల్లా మంత్రి శ్రీధర్‌బాబు రుణం తీర్చుకోలేనిది.



ప్రకటన చేస్తున్న మంత్రులు, చిత్రంలో ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్

భూ సేకరణ అవసరం ఉండదు...

రామగుండంలో విద్యుత్ కేంద్రం నిర్మాణంలో ఎన్‌టీపీసీ భాగస్వామ్యం అయితే భూసేకరణ అవసరాలు కూడా ఉండదు. పక్కనే ఉన్న కుందనపల్లి యాష్‌పాండ్‌ను కానీ, రాజాపూర్‌లో నిర్మించనున్న యాష్ పాండ్‌ను కానీ వినియోగించుకునే అవకాశం ఉంటుంది.

గుప్త నిధులు ఉన్నాయని మోసం చేసిన వ్యక్తులపై కేసు

కోనరావుపేట, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఇంటిలో గుప్త నిధులు ఉన్నాయని మోసం చేసిన వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు కోనరావుపేట ఎస్సై ప్రశాంత్ రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. కోనరావుపేట మండలం నిజామాబాద్ గ్రామానికి చెందిన దుగ్గు వేణు ఇంటిలో గుప్త నిధులు ఉన్నాయని వాటిని తీయడానికి ఖర్చు అవుతాయని నాలుగు లక్షల ఎనిమిది వేల రూపాయలను పెద్దూరు గ్రామానికి చెందిన మేకల నరేష్, కడవంచ ప్రసాద్, నదుల దేవేందర్, నదుల రాజేశం కాజేశారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రశాంత్‌రెడ్డి తెలిపారు.

అనారోగ్యంతో వృద్ధుడి ఆత్మహత్య



రాములు(ఫైల్)

కోల్‌సిటీ, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని ద్వారకానగర్‌కు చెందిన బండారి రాములు(56) అనే సింగరేణి రిటైర్డ్ ఉద్యోగి సోమవారం రాత్రి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వన్‌టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. రాములు కొంతకాలంగా మానసిక అనారోగ్యంతో బాధపడుతున్నాడు. గతంలో రెండుసార్లు ఆత్మహత్యాయత్నం చేశాడు. ఈ క్రమంలో సోమవారం రాత్రి ఇంట్లో ఆత్మహత్య చేసుకున్నాడు. రాములు భార్య భాగ్యలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

పశుగ్రాసం దగ్ధం

పెద్దపల్లి రూరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కనగర్తి గ్రామానికి చెందిన రైతు గట్టయ్య ఇంటి ముందు ఉన్న పశుగ్రాసం ప్రమాదవశాత్తు దగ్ధమైనట్లు స్థానిక రైతులు తెలిపారు. పంట పొలం కోసి మిగిలిన గడ్డిని పశువుల కోసం ఇంటి ఎదుట కుప్పగా ఏర్పాటు చేసుకోగా ప్రమాదవశాత్తు మంటలు చేలరేగాయి. స్థానికుల సహాయంతో ఆర్పివేశారు. దీంతో ఎలాంటి ప్రమాదం చోటు చేసుకోకపోగా ప్రభుత్వపరంగా సహాయం అందించాలని రైతు గట్టయ్య కోరారు.

యువత రాజకీయాల్లోకి రావాలి

- స్థానిక ఎన్నికల్లో పోటీచేస్తే బీ-ఫాం, ప్రచార సామగ్రి ఇస్తాం
- రాష్ట్రీయ లోక్‌దళ్ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ దిలీప్‌కుమార్

కరీంనగర్ టౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): అవినీతి రహిత సమసమాజ నిర్మాణం కోసం యువత రాజకీయాల్లోకి రావాలని, స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసే వారికి పార్టీ బీ-ఫామ్‌తోపాటు కరపత్రాలు, ఫ్లెక్సీలు, ఇతర ప్రచార సామగ్రి ఉచితంగా అందించి ప్రోత్సహిస్తామని రాష్ట్రీయ లోక్‌దళ్ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ దిలీప్‌కుమార్ పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న యువకులకు లోక్‌దళ్ పార్టీ ప్రోత్సాహం ఇస్తుందన్నారు. మంగళవారం నగరంలోని ఓ హోటల్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ఎన్నికలు అంటే జోక్‌గా మారిందని, మద్యం, డబ్బుల పంపిణీ లేకుండా ఎక్కడ ఏ ఎన్నికలు జరుగడం లేదని, మద్యం పంపిణీ జరుగుతుందని మునుగోడు ఉప ఎన్నిక సమయంలో వీడియో తీసి ఎన్నికల కమిషన్‌కు పంపిస్తే చర్యలు తీసుకోవలసింది పోయి రెండు బాటిళ్ల వరకు మద్యం పంపిణీ చేయవచ్చని సమాధానమిచ్చారని, ఇప్పుడు ఎన్నికల తీరు ఇలా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎలక్షన్ ప్రక్రియలో, రాజకీయాల్లో సంస్కరణలు రావలసిన అవసరముందని, అందుకోసం లోక్‌దళ్ పార్టీ ప్రజలను చైతన్యపరిచేందుకు కృషిచేస్తుందని అన్నారు. 30 సంవత్సరాలు ప్రభుత్వోద్యోగం చేసి తెలంగాణ సాధన ఉద్యమం కోసం పదవికి రాజీనామా చేసి 2001లో టీఆర్ఎస్ పార్టీలో ఫౌండర్ మెంబర్ కొనసాగిన తనను రెండు సార్లు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీగా గెలిపించారని గుర్తు చేశారు. సబ్బండ వర్గాలు ఉద్యమించి తెచ్చుకున్న స్వరాష్ట్రంలో పదేళ్ల కేసీఆర్ ధృతరాష్ట్ర పాలన, అవినీతిపాలన, కుటుంబపాలన చేశారని, విద్య, వైద్యం చిన్నాభిన్నం అయ్యాయని దిలీప్‌కుమార్ మండిపడ్డారు. దీనితో టీఆర్ఎస్‌లో కొనసాగకుండా బీజేపీకి రాష్ట్ర అధ్యక్షుడిగా బండి సంజయ్‌కుమార్ చేపట్టిన కార్యక్రమాలతో రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తుందనే ఆలోచనతో అందులోకి వెళ్లగా ఆయన రాష్ట్ర అధ్యక్ష పదవి పోయాక ఆ పార్టీలో ఏమీ మార్పు కనిపించలేదని అన్నారు. కేసీఆర్ పాలనలో కంటే రేవంత్‌రెడ్డి పాలనలో ఊరికి ఆరుగురు చొప్పున దోపిడీ, అవినీతికి పాల్పడుతున్నారని ప్రజలకు ఒరిగిందేమీ లేదని ఆరోపించారు. రెండు లక్షల ఉద్యోగాల భర్తీ, 28 లక్షల వృత్తి నైపుణ్య శిక్షణలు పూర్తి చేడయంలో రేవంత్‌రెడ్డి సర్కార్ విఫలమైందని ఆరోపించారు. విలేకరుల సమావేశంలో రాష్ట్రీయ లోక్‌దళ్ జిల్లా బియ్యాల కృష్ణ, ప్రధాన కార్యదర్శులు మడకం ప్రసాద్, దొర, రిషబ్, నర్సింహారావు, వివిధ జిల్లాల అధ్యక్షులు గౌర బీరప్ప, సిద్ధం కుమార్, సతీష్, రాంప్రసాద్, సుధాకర్, బుల్లెట్ వెంకన్న తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్రీయ లోక్‌దళ్ రాష్ట్ర అధ్యక్షుడు దిలీప్‌కుమార్

విద్యుదాఘాతంతో ఎద్దు మృతి

కాల్వశ్రీరాంపూర్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మొట్లపల్లి గ్రామానికి చెందిన గోదారి చంద్రయ్య అనే రైతుకు చెందిన ఎద్దు మంగళవారం విద్యుదాఘాతంతో మృతి చెందింది. బాధిత రైతు తెలిపిన వివరాల మేరకు రెండు ఎద్దులు మేత కోసం గ్రామ శివారు వద్దకు తీసుకు వెళ్లి మేపుతుండగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఎర్త్ వైరు తగిలి షాక్‌తో ఎద్దు మృతి చెందిందని తెలిపాడు. ఎద్దు విలువ సుమారు రూ.70 వేలు ఉంటుందని బాధిత రైతు చంద్రయ్య పేర్కొన్నాడు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు

మానకొండూర్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలంలోని కొల్లాపూర్ గ్రామానికి చెందిన ఎండీ అబ్దుల్(40) ద్విచక్రవాహ నంపై కరీంనగర్ నుంచి హుజూరాబాద్ వైపు వస్తున్నాడు. మానకొండూరు మండలంలోని చెంజర్ల బ్రిడ్జి వద్ద కుక్క అడ్డురావడంతో అదుపుతప్పి కిందపడ్డాడు. ప్రమాదంలో అబ్దుల్‌కు తీవ్రగాయాలు కాగా 108 వాహనంలో కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు.

దొంగతనం కేసులో ఒకరికి ఆరునెలల జైలు శిక్ష

సిరిసిల్ల రూరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): దొంగతనం కేసులో ఒక వ్యక్తికి ఆరునెలల జైలు శిక్ష విధిస్తూ సిరిసిల్ల ప్రథమ శ్రేణి న్యాయమూర్తి ప్రవీణ్ మంగళవారం తీర్పును వెల్లడించినట్లు సిరిసిల్ల టౌన్ సీఐ కృష్ణ తెలిపారు. ఇల్లంతకుంట మండలం పెద్దలింగాపూర్ గ్రామానికి చెందిన శీలం బాబు అనే వ్యక్తి తన భార్య శీలం పద్మను సిరిసిల్ల జిల్లా ఆసుపత్రిలో ప్రసూతి కోసం చేర్పించాడు. ఈ క్రమంలో తన వాహనం కనిపించకపోవడంతో పోలీసులకు బాబు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన ఎస్ఐ వినీతరెడ్డి వాహనం కోసం గాలిస్తుండగా వాహనాన్ని దొంగిలించిన దుర్గిట్ల నరేష్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయడంతో సీఎంఎస్ ఎస్ ఎస్ఐ శ్రావణ్ ఆధ్వర్యంలో కోర్టు కానిస్టేబుల్ వేముల నరేష్ సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టారు. న్యాయమూర్తి ప్రవీణ్ నరేష్‌కు ఆరు నెలల జైలు శిక్షను విధించారు.

రాష్ట్రస్థాయి పద్య రచనలో విద్యార్థినుల ప్రతిభ



ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలతో విద్యార్థినులు, ఉపాధ్యాయులు

ఎల్లారెడ్డిపేట, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థినులు సారిక, దివ్యజ్యోతి, హర్షిణి, సంజన, నందినిలు రాష్ట్ర స్థాయి పద్య రచన పోటీల్లో ప్రతిభ కనబర్చారని పాఠశాల హెచ్ఎం మనోహరచారి మంగళవారం తెలిపారు. బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని తెలంగాణ సారస్వత పరిషతు ఆధ్వర్యంలో నిర్వహించిన పద్య రచన పోటీల్లో విద్యార్థినులు సత్తా చాటారని పేర్కొన్నారు.

జ్ఞాపికలతో పాటు ప్రశంసా పత్రాలను అందుకున్నారని చెప్పారు. రాష్ట్ర స్థాయి పద్య రచన పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థిలను అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అంజన్‌రెడ్డి, వేణుగోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

వివాహిత అనుమానాస్పద మృతి



నీరజ(ఫైల్)

ఎల్లారెడ్డిపేట, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లగొల్లపల్లి గ్రామానికి చెందిన వివాహిత అందె నీరజ (25) అనే వివాహిత మంగళవారం అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. కుటుంబ సభ్యులు, పోలీసుల కథనం మేరకు.. మండలంలోని రాచర్లగొల్లపల్లిలోని అందె దేవరాజుకు 2014లో కామారెడ్డి జిల్లా రామారెడ్డి మండలం అన్నారం గ్రామానికి చెందిన పంగ రాజవ్వ-నాంపల్లి దంపతుల కూతురు నీరజతో వివాహమైంది. ఆ దంపతులకు కుమారుడు జోసిత్ ఉన్నాడు. ఉపాధి నిమిత్తం దేవరాజు యేడాది కిందట దుబాయి దేశానికి వలస వెళ్లాడు. అక్కడ ఆయన తన మామ, బావమరిదితో కలిసి ఉంటున్నాడు. నీరజ తన కొడుకు జోసిత్‌తో కలిసి జీవిస్తోంది. కొడుకు పాఠశాలకు వెళ్లిన అనంతరం వివాహిత నీరజ ఇంటికి గడియ వేసుకుంది. అనుమానం వచ్చిన చుట్టు పక్కల వారు పిలిచినా స్పందించకపోవడంతో వారు అన్నారంలోని నీరజ తల్లి రాజవ్వకు సమాచారం అందించారు. ఆమె వచ్చి చూసేసరికి కూతురు ఉరి వేసుకుని విగతజీవిగా కనిపించింది. మృతురాలు తల్లి రాజవ్వ ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మరణంగా కేసు నమోదు చేశామని పోలీసులు వివరించారు. మృతిపై అన్ని కోణాల్లో ఆరా తీస్తున్నామని పేర్కొన్నారు.

ఇసుక ట్రాక్టర్లను అడ్డుకున్న రైతులు

కోనరావుపేట, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : కోనరావుపేట మండలం కనగర్తి గ్రామంలో ఇసుక ట్రాక్టర్లను రైతులు మంగళవారం అడ్డుకున్నారు. ప్రభుత్వ అనుమతితో నడిపిస్తున్న ఇసుక ట్రాక్టర్లను గ్రామస్థులు, రైతులు అడ్డుకొని నిరసన వ్యక్తం చేశారు. కనగర్తి మూలవాగు నుంచి ఇసుక తరలించడం వల్ల భూగర్భ జలాలు అడుగంటిపోయి సాగునీరుకు ఇబ్బందికరంగా మారుతుందని రైతులు తెలిపారు. గ్రామ పరిధిలోనే అనుమతి ఇవ్వాలని, వేరే గ్రామాలకు అనుమతి ఇవ్వడం వల్ల వందలాది ట్రాక్టర్ల ద్వారా ఇసుకను తరలించడంతో భూగర్భ జలాలు అడుగంటిపోతాయని అన్నారు. తమ గ్రామం నుంచే కాకుండా మూలవాగు పరిసర ప్రాంతాల నుంచి ఇవ్వాలని కోరారు.



కనగర్తిలో నిలిచిన ఇసుక ట్రాక్టర్లు

జాతీయ కళా ఉత్సవాల్లో తృతీయ బహుమతి


జాతీయస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు

చొప్పదండి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): జాతీయ కళా ఉత్సవాల్లో నవోదయ విద్యార్థులు ఇద్దరు ప్రతిభ కనబరిచి తృతీయ బహుమతులు సాధించారు. ఢిల్లీలో జరిగిన జాతీయ కళోత్సవాల్లో 9వ తరతి విద్యార్థి ఎం కార్తికేయ, 10వ తరగతి విద్యార్థి జి వంశీ ఇండిజీనియస్ టాయ్స్ మేకింగ్ పోటీల్లో పాల్గొని తృతీయ బహుమతులు సాధించారు. కాగా ప్రతిభ కనబరిచిన విద్యార్థులను, ఆర్ట్ టీచర్ నాగేశ్వర్‌రావును ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ బ్రహ్మానందరెడ్డి అభినందించారు.

పలు నిర్మాణాల కూల్చివేత


రోడ్డు విస్తరణలో నిర్మాణాలను కూల్చివేస్తున్న సిబ్బంది

వేములవాడ, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): వేములవాడ అమర వీరుల స్థూపం నుంచి రాజన్న ఆలయం వరకు చేపడుతున్న రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా పలు నిర్మాణాల కూల్చివేతలను మంగళవారం పునఃప్రారంభించారు. ఈ సందర్భంగా రోడ్డుకు ఇరువైపులా మార్కింగ్ ఇచ్చిన వరకు నిర్మాణాలను కూల్చి వేశారు. కాగా పలువురు ఇంటి యజమానులు మార్కింగ్ దాటి ముందుకు వచ్చి నిర్మాణాలను తొలగిస్తున్నారని కూల్చివేతలను అడ్డుకునేందుకు యత్నించారు. రోడ్డు విస్తరణకు సంబంధిత అధికారులు ఇచ్చిన మార్కింగ్ వరకు తొలగిస్తున్నట్లు తెలిపారు.

- ఈనెల 29వ తేదీ వరకు దరఖాస్తుకు గడువు
- వచ్చే ఏడాది జనవరిలో ఆన్‌లైన్ విధానంలో పరీక్ష
- కోచింగ్ సెంటర్లకు డిమాండ్

టెట్‌కు వేళాయె..



జగిత్యాల, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)కు నోటిఫికేషన్ రావడంతో ప్రభుత్వ ఉపాధ్యాయులుగా స్థిరపడాలనుకునే బీఈడీ, డీఈడీ పూర్తి చేసిన ఆశావహుల్లో ఉత్సాహం నెలకొంది. రాష్ట్ర ప్రభుత్వం త్వరలో ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేయనుందనే వార్తల నేపథ్యంలో చాలా మంది టెట్‌లో అత్యధిక మార్కులు సాధించాలనే తపనతో ప్రిపేర్ అవుతున్నారు. ప్రభుత్వ ఉపాధ్యాయులు కూడా టెట్ అర్హత సాధించాలని నిబంధన విధించడంతో వారు కూడా దరఖాస్తు చేస్తున్నారు. ఈనెల 15వ తేదీ నుంచి 29వ తేదీ వరకు టెట్ దరఖాస్తులను స్వీకరించనున్నారు. వచ్చే యేడాది జనవరి 3వ తేదీ నుంచి 31వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో పరీక్షలు నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. పలువురు అభ్యర్థులు ఇప్పటికే టెట్ రాసేందుకు కోచింగ్ సెంటర్లను ఆశ్రయించగా మరికొందరు గ్రంథాలయాల్లో, ఇంటి వద్ద సొంతంగా ప్రిపేర్ అవుతున్నారు.

● సెలవుల్లో పలువురు ఆశావహులు..

వచ్చే యేడాది జనవరిలో పరీక్ష నిర్వహించేందుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గత టెట్ పరీక్షకు జగిత్యాల జిల్లా నుంచి సుమారు 5 వేల మంది అభ్యర్థులు హాజరయ్యారు. ప్రస్తుతం అభ్యర్థుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. గతంలో టెట్ క్వాలిఫై అయిన వారు మార్కులు మెరుగు పర్చుకునేందుకు మళ్లీ టెట్ రాసే అవకాశం ఉంది. ఉపాధ్యాయ కొలువుకు టెట్ క్వాలిఫై తప్పనిసరి కావడంతో పరీక్షకు సన్నద్ధం కావడానికి పలువురు టీచర్లు సెలవు బాట పడుతున్నారు.

● ప్రభుత్వ టీచర్లకూ తప్పనిసరి

సెప్టెంబరు 1వ తేదీన వెలువడిన సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం ఐదు సంవత్సరాల పైబడి సర్వీస్ ఉన్న టీచర్లు పదోన్నతి అవసరమునుకుంటే రాబోయే రెండేళ్లలో టెట్ తప్పనిసరిగా పాస్ కావాలని, లేదంటే ఉద్యోగాలు కోల్పోతారని సుప్రీం కోర్టు తీరు వెలువరించింది. దీనిపై విద్యాహక్కు చట్టం అమలులోకి రాకముందు ఉన్న టీచర్లకు టెట్ మినహాయింపు కావాలని కోరుతూ, దేశ వ్యాప్తంగా పలు రాష్ట్రాల నుంచి సుప్రీం కోర్టులో రివ్యూ పిటిషన్లు దాఖలు చేశారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన టెట్‌లో ఎలాంటి మినహాయింపులు ఇవ్వలేదు. కోర్టు ఆదేశాల మేరకు టెట్ తప్పనిసరిగా ఇన్ సర్వీస్ టీచర్లు రాయాలని చెబుతూ కొన్ని ప్రత్యేక మినహాయింపు ఇచ్చారు. దీంతో ఉపాధ్యాయులకు టెట్ భయం పట్టుకుంది. ఇన్ సర్వీస్‌లో ఉన్న ఎస్‌జీటీలు పేపర్-1, స్కూల్ అసిస్టెంటట్లు పేపర్-2 రాయాల్సి ఉంటుంది.

పార్లమెంట్‌లో చట్టం చేయాలి



-తిరుక్కోవెల శ్యామ్ సుందర్, టీఎస్ యూటీఎఫ్ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు

సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులకు ఉపాధ్యాయ అర్హత పరీక్ష మినహాయింపు ఇవ్వాలి. ఇప్పటికే సమస్యను ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకువెళ్లాం. ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి సైతం ఈ మెయిల్, పోస్ట్ ద్వారా, నెలాఖరు వరకు ఎంపీలకు లేఖలు అందించనున్నాం. సర్వీసులో ఉన్న టీచర్ల రక్షణ కోసం పార్లమెంట్‌లో చట్టం చేయాలి.

ఇన్‌సర్వీస్ టీచర్లకు టెట్ మినహాయించాలి



-బోయినిపల్లి ఆనందరావు, పీఆర్‌టీయూ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు

ఇన్ సర్వీస్ టీచర్లకు టెట్ మినహాయింపు ఇవ్వాలి. కేంద్ర మానవ వనరుల శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రదాన్‌కు ఇప్పటికే వినతిపత్రం ఇచ్చాం. వచ్చే పార్లమెంట్ సమావేశాల్లో టెట్ నుంచి మినహాయింపు ఇస్తూ నిర్ణయం తీసుకుంటారని ఆశిస్తున్నాం. 2010కి ముందు నియామకమైన ఉపాధ్యాయులందరికీ టెట్ మినహాయింపు అవసరం.

కరాటే పోటీలకు చీఫ్ అఫీషియల్‌గా వసంత్ కుమార్



కరీంనగర్ స్పోర్ట్స్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు చెందిన ఒకినావా మార్షల్ ఆర్ట్స్ అకాడమీ చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ కె వసంత్ కుమార్ జాతీయ కరాటే పోటీలకు చీఫ్ అఫీషియల్‌గా నియమితులయ్యారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విశాఖపట్నంలో ఈ నెల 27 నుంచి 30వ తేదీ వరకు జరిగే జాతీయస్థాయి కరాటే పెటీల్లో ఆయన చీఫ్ రెఫరీగా విధులను నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా వసంత్‌కు మార్‌ను పలువురు కరాటే మాస్టర్లు అభినందించారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

వీణవంక, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలో అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ఏఎస్‌ఐ వెంకటరెడ్డి మంగళవారం తెలిపారు. మండలంలోని పోతిరెడ్డిపల్లి మానేరు వాగు నుంచి ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించామన్నారు. ట్రాక్టర్‌ను సీజ్ చేసి యజమాని చేపూరి మహేందర్‌పై కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ పేర్కొన్నారు.

శ్రీరాంసాగర్‌లో నిలకడగా నీరు

జగిత్యాల, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్‌లోకి ఎగువ ప్రాంతాల నుంచి మంగళవారం స్వల్పంగా నీరు వస్తోంది. దీంతో డ్యామ్‌లో నీరు నిలకడగా ఉంది. ఎగువ ప్రాంతం నుంచి ప్రాజెక్టులోకి 1,338 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 80.501 టీఎంసీలు కాగా అంతే స్థాయి నీటి మట్టంతో ప్రాజెక్టు నిండుకుండలా ఉంది.

కాంగ్రెస్ నాయకులే ఇసుక మాఫియా అవతారం ఎత్తారు

- ఇసుక కోసం గుంపుల చెక్ డ్యామ్‌ను పేల్చేశారు - మాజీ మంత్రి హరీష్ రావు

జమ్మికుంట రూరల్/ఓదెల, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): రేవంత్‌రెడ్డి పాలనలో కాంగ్రెస్ నాయకులు పలు జిల్లాల్లో ఇసుక మాఫియా అవతారం ఎత్తారని మాజీ మంత్రి తన్నీరు హరీష్‌రావు విమర్శించారు. ఓదెల మండలం గుంపుల, జమ్మికుంట మండలం శంభునిపల్లి, తనుగుల మధ్యనున్న మానేరు వాగులో కూలిపోయిన చెక్ డ్యామ్‌ను ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలతో కలిసి మంగళవారం పరిశీలించారు. అనంతరం మాజీ మంత్రి హరీష్ రావు మీడియాతో మాట్లాడుతూ గుంపుల, శంభునిపల్లి చెక్‌డ్యామ్‌ను ఇసుక మాఫియానే కూల్చిందన్నారు. దీనిని కొందరు కాంగ్రెస్ పెద్దలు ప్రోత్సహిస్తున్నారన్నారు. రాష్ట్రంలో ఇసుక రవాణాకు అడ్డంకిగా ఉన్నాయనే ఉద్దేశంతో పలు జిల్లాల్లో చెక్ డ్యాములను జిలెటిన్ స్టిక్‌లతో పేల్చివేశారని, దీంతో మత్స్యకారులు, రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. గతంలో పెద్దపల్లి మండలం భోజన్నపేట హుస్సేన్‌మియా వాగులోని చెక్ డ్యాంను ఇసుక మాఫియా పేల్చివేయగా రైతులే జిలెటిన్ స్టిక్‌లతోపాటు, ట్రాక్టర్లను, నిందితులను పట్టుకున్నారన్నారు. వారిని పోలీసులకు అప్పజెప్పినా కేసు నమోదు కాలేదన్నారు. అప్పుడు వందల మంది రైతులు ఇసుక మాఫియాపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారని, అప్పుడే చర్యలు తీసుకున్నట్లయితే నేడు గుంపుల మానేరు వాగులోని చెక్ డ్యామ్ దెబ్బతినేది కాదన్నారు. చెక్ డ్యామ్‌ను పేల్చివేశారని మత్స్యకారులే చెబుతున్నారని, శనివారం పొద్దంతా మానేరు నిండా నీరు ఉందని, తెల్లవారే సరికి కూలిపోయి ఉందని కార్మికులు తెలిపారన్నారు. వర్షాకాలంలో చెక్ డ్యాంపై నీటి ప్రవాహం రోజుల తరబడి వెళ్లినప్పుడే ఏమి కాలేదని, నీటి ప్రవాహం, వర్షాలు తగ్గిన తర్వాత చెక్ డ్యామ్ ఎలా కూలిపోయిందని ప్రశ్నించారు. రాష్ట్రంలో ఇసుక మాఫియా రాజ్యం కొనసాగుతుందని, ప్రస్తుతం వాగులోని చెక్ డ్యామ్‌ను పేల్చివేసిన నిందితులపై కేసు నమోదు చేసి, నిర్మాణ వ్యయం 24 కోట్లను రికవరీ చేసి ఉన్నత స్థాయిలో విచారణ జరపాలని డిమాండ్ చేశారు.


కూలిన చెక్‌డ్యాంను పరిశీలిస్తున్న మాజీ మంత్రి హరీష్‌రావు, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, బీఆర్ఎస్ నాయకులు

కార్యక్రమంలో ఎమ్మెల్యేలు గంగుల కమలాకర్, కౌశిక్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు దాసరి మనోహర్ రెడ్డి, రసమయి బాలకిషన్, జమ్మికుంట మున్సిపల్ మాజీ చైర్మన్ తక్కళ్లపల్లి రాజేశ్వర్‌రావు, నాయకులు పొనగంటి సంపత్, పింగిలి రమేష్, మడికొండ సురేందర్ రావు, మునిపట్ల తిరుపతిరెడ్డి, పోడేటి రామస్వామి, రఘువీర్‌సింగ్, గంట రాములు, వంగల తిరుపతి రెడ్డి, నూనేటి సంపత్, ఐరెడ్డి వెంకటరెడ్డి, కనికి రెడ్డి సతీష్, ఆరెల్లి మొండయ్య, కాంతాల సదారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొండగట్టులో భక్తుల రద్దీ


ఆలయ ఆవరణలో భక్తుల కోలాహలం

మల్యాల, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయస్వామి క్షేత్రం మంగళవారం భక్తులతో కిక్కిరిసిపోయింది. సోమవారం రాత్రి వరకు చేరుకున్న వారితో పాటు వేలాదిగా వచ్చిన భక్తులు వేకువ జాము నుంచే బారులుతీరి స్వామి వారికి మొక్కులు చెల్లించుకున్నారు. సమ్మక్క సారలమ్మ జాతర రానున్న నేపథ్యంలో ఉమ్మడి నిజామాబాద్, ఆదిలాబాద్, వరంగల్ తదితర జిల్లాల నుంచి అధికసంఖ్యలో వచ్చిన భక్తులతో కొండంతా రద్దీ నెలకొంది. భక్తులకు ఇబ్బందులు కలగ కుండా ఆలయ అధికారులు పర్యవేక్షించారు. అంజన్నను దర్శించుకున్న భక్తులు బేతాళుడు, శ్రీరాముని ఆలయంలోనూ పూజలు జరిపారు. కాగా జైజంక్షన్, ఘాట్‌రోడ్డుపై వాహనాల రాకపోకలకు అస్తవ్యస్త పార్కింగ్‌తో భక్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రాత్రి వరకు భక్తులు భక్తులు అంజన్నను దర్శించుకున్నారు.

మూడు నెలలు.. ముహూర్తాలు కరువు

- రేపటి నుంచి శుక్ర మౌఢ్యం
- డిసెంబరు 21 నుంచి పుష్యమాసం



కరీంనగర్ కల్చరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): విశ్వావసు నామ సంవత్సరంలో ఈ నెల 27వ తేదీ నుంచి మూడు నెలల పాటు వివాహాది శుభ ముహూర్తాలు లేవు. నవంబ రు 27 గురువారం నుంచి ఫిబ్రవరి 17, 2026 వరకు శుక్రమౌఢ్యం కొనసాగనుంది. శూన్యమాసంగా పిలిచే పుష్యమాసం డిసెంబరు 20 నుంచి ప్రారంభమై జనవరి 18తో ముగుస్తుంది. జనవరి 19, సోమవారం నుంచి ఫిబ్రవరి 17 వరకు మాఘమాసం ఉంటుంది. మాఘ మాసం శుభ మాసమే అయినా ఈ మాసంలో మూఢం ఉండటంతో ముహూర్తాలు లేవు. మూఢం, పుష్య మాసంతో కలిపి చూస్తే సుమారు మూడు నెలల వరకు ముహూర్తాలు లేవు. తిరిగి ఫిబ్రవరి 19వ తేదీ గురువారం నుంచి శుభముహూర్తాలు ప్రారంభం కానున్నాయి.

● పండగల వివరాలివే...

డిసెంబరు 1న గీతాజయంతి, 2న హనుమద్వ్రతం, 4న దత్తాత్రేయ జయంతి, 8న సంకటహర చతుర్థి. 16 నుంచి ధనుర్మాసారంభం, 18న మాస శివరాత్రి. 30న ముక్కోటి ఏకాదశి ఉంటుంది. జనవరి 6న సంకటహర చతుర్థి, 14న భోగి-గోదా కల్యాణాలు, 15న సంక్రాంతి, 16న కనుమ. 17న ముక్కనుమ, మాస శివరాత్రి. 23న వసంత పంచమి. 25న రథ సప్తమి. 29న భీష్మ ఏకాదశి, 31న శని త్రయోదశి ఉంటాయి. ఫిబ్రవరి 5న సంకటహర చతుర్థి, 13న షట్ తిల ఏకాదశి, 15న మహా శివరాత్రి నిర్వహిస్తారు.

నా భార్యను బలవంతంగా తీసుకెళ్లారు

- పోలీసులకు యువకుడి ఫిర్యాదు

మల్యాల, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): తాను ప్రేమించి పెళ్లి చేసుకున్న భార్యను ఆమె కుటుంబసభ్యులు బలవంతంగా తీసుకెళ్లారని భర్త పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

మల్యాల మండల కేంద్రానికి చెందిన ముత్తుకుమార్ అనే యువకుడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని గుంటూరు జిల్లాకు చెందిన మాధవి అనే యువతిని ఈ నెల 16వ తేదీన ప్రేమ వివాహం చేసుకున్నాడు. దీంతో ఆగ్రహంతో ఉన్న యువతి కుటుంబసభ్యులు ముత్తుకుమార్ ఇంటికి వచ్చి అతడి తల్లిదండ్రులపై కర్రలతో దాడి చేయడమే కాకుండా మాధవిని కారులో బలవంతంగా తీసుకెళ్లినట్లు మాధవి భర్త ముత్తుకుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో పలువురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై నరేశ్‌కుమార్ పేర్కొన్నారు.

గంజాయి అమ్ముతూ, తాగిన వ్యక్తులకు జైలు శిక్ష

సిరిసిల్ల రూరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల పట్టణంలో గంజాయి అమ్ముతూ తాగుతున్న ముగ్గురు వ్యక్తులకు 11 నెలల జైలుశిక్షతో పాటు జరిమానా విధిస్తూ జడ్జి తీర్పు ఇచ్చినట్లు టౌన్ సీఐ కృష్ణ తెలిపారు. తంగళ్లపల్లి మండలం లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన వీరభత్తిని అజయ్‌తో పాటు అదే మండలానికి చెందిన గట్టుపల్లి క్రాంతిలను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని తెలిపారు. కోర్టులో సీఎం ఎస్ఎస్ఐ శ్రావణ్ చార్జిషీట్ దాఖలు చేయగా కోర్టు కానిస్టే బుల్ వేముల నరేష్ ఆరుగురు సాక్షులను ప్రవేశపెట్టారు. దీంతో జడ్జి గట్టుపల్లి క్రాంతికి 11 నెలు జైలు శిక్ష, వీరబత్తిని అజయ్‌కి నెలరోజుల శిక్షతోపాటు 2,500 రూపాయల జరిమానా విధించారని తెలిపారు. మరో గంజాయి కేసులతో జక్కనపల్లి వివేక్‌కు నెలరోజుల జైలు శిక్షతో పాటు 2,500 రూపాయల జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు.

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలను ఘనంగా నిర్వహిస్తాం

- సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి - మహిళల జిల్లా కబడ్డీ జట్టు శిక్షణ శిబిరం ప్రారంభం

కరీంనగర్ స్పోర్ట్స్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి సీనియర్స్ కబడ్డీ పోటీలను ఘనంగా నిర్వహిస్తామని సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి తెలిపారు. మంగళవారం కరీంనగర్ జిల్లా కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్టేడియం కబడ్డీ గ్రౌండ్‌లో ఆయన జిల్లా మహిళల కబడ్డీ జట్టు శిక్షణ శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. వచ్చే నెల 11, 12, 13, 14 తేదీల్లో జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలను ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా జట్టు ప్రతిభచాటి విజేతలుగా నిలిచేందుకుగాను జట్లకు శిక్షణ శిబిరాలను నిర్వహిస్తున్నామన్నారు. రాష్ట్రస్థాయి పోటీల నిర్వహణకు అవసరమైన సహాయ సహకారాలను సుడా ఆధ్వర్యంలో అందిస్తామన్నారు. రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు సీహెచ్ సంపత్‌రావు మాట్లాడుతూ రాష్ట్రస్థాయి పోటీల్లో రాష్ట్రంలోని 33 జిల్లాల నుంచి 66 మహిళలు, పురుషుల జట్లు పాల్గొంటాయన్నారు. పోటీల్లో పాల్గొనే జట్లకు, అధికారులకు, అఫీషియల్స్‌కు ఉచిత భోజన, వసతి సౌకర్యాలను జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్నామన్నారు. పోటీలను ఘనంగా నిర్వహించేందుకు అందరు సహాయసహకారాలను అందించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మల్లేష్‌గౌడ్, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘ ప్రధానకార్యదర్శి ఆడెపు శ్రీనివాస్, ప్రతినిధి కొమురోజు కృష్ణ, వీరన్న, జిల్లా జట్ల కోచ్‌లు పద్మ, సుధాకర్, సీహెచ్ మల్లేశ్, సీనియర్ క్రీడాకారుడు నరోత్తం పాల్గొన్నారు.


కరీంనగర్ జిల్లా మహిళా కబడ్డీ జట్టుతో సుడా చైర్మన్ నరేందర్‌రెడ్డి, అతిథులు

నూతన జాతీయ విద్యావిధానాన్ని వ్యతిరేకించండి

- డీటీఎఫ్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు రఘుశంకర్‌రెడ్డి - పీడీఎస్‌యూ ఉమ్మడి జిల్లా మహాసభ



మాట్లాడుతున్న డీటీఎఫ్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు ఎం రఘుశంకర్‌రెడ్డి

కరీంనగర్ టౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): దేశంలో నూతన జాతీయ విద్యావిధానాన్ని వ్యతిరేకించాలని డీటీఎఫ్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు ముస్కు రఘుశంకర్‌రెడ్డి విద్యార్థులకు పిలుపునిచ్చారు. మంగళవారం నగరంలోని ఫిలింభవన్‌లో పీడీఎస్‌యూ ఉమ్మడి కరీంనగర్ జిల్లా నాలుగో మహాసభలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ముందుగా సంస్థాగత జెండాను పీడీఎస్‌యూ జాతీయ నాయకుడు పి మహేశ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మహాసభలకు ముఖ్యఅతిథులుగా హాజరైన ఎం రఘుశంకర్‌రెడ్డి, పీడీఎస్‌యూ జాతీయ నాయకుడు పి మహేశ్, రాష్ట్ర అధ్యక్షుడు ఎస్‌వి శ్రీకాంత్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పొడపంగి నాగరాజు మాట్లాడారు. ప్రధాని నరేంద్రమోదీ, సీఎం రేవంత్‌రెడ్డి హయాంలో విద్యారంగం పూర్తిగా సంక్షోభంలోకి నెట్టబడిందని, విద్యా ప్రమాణాలు ఘోరంగా పడిపోయాయని విమర్శించారు. విద్యలో నాణ్యత కూడా లోపించిందన్నారు.

విద్య ద్వారానే మెరుగైన సమాజం సాధ్యపడుతుందన్నారు. విద్యారంగాన్ని అభివృద్ధి పరచడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. బడ్జెట్‌లో విద్యకు అతి తక్కువ నిధులను కేటాయిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోవైపు పాఠ్యాంశాలను మారుస్తున్నారని పాఠ్యపుస్తకాల నుంచి చరిత్రను, సైన్స్‌లను తొలగిస్తున్నారని, పురాణ కథలను, వాస్తు జ్యోతిష్య శాస్త్రాలను పాఠ్యపుస్తకాల్లోకి ప్రవేశపెడుతున్నారని విమర్శించారు. ప్రభుత్వాలు ఏకపక్షంగా నూతన జాతీయ విద్యావిధానాన్ని యూజీసీ నూతన నిబంధనలను తీసుకువచ్చిందని విద్యార్థులంతా వీటిని వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. శాస్త్రీయమైన విద్యావిధానాన్ని అమలు పరచాలని డిమాండ్ చేశారు. ఇందుకోసం పీడీఎస్‌యు 50 ఏళ్లుగా ఉద్యమిస్తోందని, ఎంతో మంది విద్యార్థులు అమరత్వం పొందారని అన్నారు. వారి ఆశయ సాధనకు పీడీఎస్‌యూ కృషి చేస్తుందని అన్నారు. డిసెంబరు 10,11,12 తేదీల్లో వరంగల్ జిల్లాలో 23వ రాష్ట్ర మహాసభలను నిర్వహిస్తున్నామని, దీనికి విద్యార్థి లోకం కదలిరావాలని కోరారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి కూతాటి రాణా ప్రతాప్, జిల్లా నాయకులు రమేశ్, అజయ్, రాకేశ్, అస్లాం, హర్షవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

మత్స్య సహకార సంఘాలకు చేయూతనివ్వండి

- అఖిలభారత మత్స్యకారుల సమాఖ్య జాతీయ ప్రధాన కార్యదర్శి స్టాన్లీ



సమావేశంలో మాట్లాడుతున్న స్టాన్లీ

సుభాష్‌నగర్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మత్స్యకారుల సహకార సంఘాలకు చేయూతనివ్వాలని అఖిలభారత మత్స్యకారుల సమాఖ్య జాతీయ ప్రధాన కార్యదర్శి, కేరళ రాష్ట్ర ఫిషరీష్ కార్పొరేషన్ చైర్మన్ స్టాన్లీ కోరారు. మంగళవారం కరీంనగర్‌లోని రెవెన్యూ గార్డెన్‌లో తెలంగాణ మత్స్యకారులు, మత్స్యకార్మికుల నాలుగో రాష్ట్ర సదస్సును నిర్వహించారు. ఈ సదస్సుకు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోరింకల నర్సింహస్వామి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా స్టాన్లీ మాట్లాడుతూ సముద్రం లేకున్నా మత్స్య సంపద సమృద్ధిగా ఉన్నా- మత్స్యకారుల అభివృద్ధి మాత్రం జరగడం లేదన్నారు. మత్స్యకారులను కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందన్నారు. మత్స్యకారులకు ఇంత వరకు సొంత ఇల్లు, చదువు, ఉద్యోగం లేదని కేవలం చేపలు పట్టుకొని జీవనోపాధి పొందుతున్నారని తెలిపారు. రాష్ట్రంలో కృష్ణ, గోదావరి నదులను కలుపుకొని 77 నదులు ఉన్నాయని, 24వేల నదులు ఉన్నాయని తెలిపారు. రాష్ట్రంలో 10 లక్షల మంది మత్స్య వృత్తిపై ఆధారపడి జీవనోపాధి పొందుతున్నారని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏమైనా సహాయం చేశాయా అని ప్రశ్నించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మత్స్యకారుల సహకార సంఘాలకు చేయూతనివ్వాలని డిమాండ్ చేశారు. మత్స్యశాఖ రిటైర్డ్ డీడీ మహిపాల్ మాట్లాడుతూ రాష్ట్రంలో సకాలంలో చేప సీడ్ వేయకపోవడం వల్ల చేపల్లో అనుకున్నంతగా ఎదుగుదల లేదన్నారు. జూన్ లేదా జూలై నెలలో చేప పిల్లలను వేయాలని కోరారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మత్స్య పారిశ్రామిక సహకార సంఘాల మాజీ చైర్మెన్ చేతి ధర్మయ్య మాట్లాడుతూ మత్స్యమిత్ర మహిళా గ్రూపులను కొనసాగించాలని, మిడ్‌మానేరులో విస్తారంగా చేపలు పెంచే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాగర్, అంబటి వెంకన్న, జీవ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు శంకర్, మునిగల రమేశ్, వర్ద వెంకటరెడ్డి, గీట్ల ముకుందరెడ్డి, బాలమణి, జిల్లా అధ్యక్షుడు పిట్టల వెంకటేష్, ప్రధానకార్యదర్శి గణేశ్, రాష్ట్ర ప్రధానకార్యదర్శి బోయిన శ్రీకాంత్, జునగరి లక్ష్మన్, మాటూరు సమ్మయ్య, అరుణ, శశికళ, జెడిగల రాజన్న, సత్తయ్య, పప్పు సదానందం, మాటూరి లక్ష్మణ్, యు శ్రీనివాస్, గడప నరసింహస్వామి, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

బద్దిపోచమ్మ సన్నిధిలో భక్తజనసందడి


అమ్మవారికి బోనాలు సమర్పించేందుకు బారులుతీరిన భక్తులు

వేములవాడ టౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): వేములవాడ బద్దిపోచమ్మ దేవాలయంలో మంగళవారం భక్తుల సందడి నెలకొంది. వేలాదిమంది భక్తులు అమ్మవారికి బోనం వండి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించారు. తెల్లవారు జామునే పురవీధుల్లో ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి బోనాలు సమర్పించడానికి భక్తులకు రెండుగంటల సమయం పట్టింది. క్యూలైన్‌లో భక్తులలు కిక్కిరిసిపోయారు. ఒక్కసారిగా బద్దిపోచమ్మ అమ్మవారి ఆలయానికి వేలాదిమంది భక్తులు చేరుకోవడంతో ఇబ్బందులకు గురయ్యారు.

మహిళలు ఆకాశమే హద్దుగా ముందుగా వెళ్లాలి

- జిల్లా వ్యాప్తంగా రూ. 8.12 కోట్ల వడ్డీలేని రుణాల పంపిణీ - ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



మహిళలకు వడ్డీ లేని రుణాల చెక్కులను అందజేస్తున్న విప్, ఇన్‌చార్జి కలెక్టర్

వేములవాడ, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మహిళలు ఆకాశమే హద్దుగా ముందుకు సాగాలని వేములవాడ శాసన సభ్యులు, రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మహిళలకు సూచించారు. పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో మంగళవారం మహిళ శక్తి కింద సిహెచ్‌జీలకు ఇంచార్జి కలెక్టర్ గరిమా అగ్రవాల్‌తో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రభుత్వ విప్ మాట్లాడుతూ ఇందిరా మహిళా శక్తి కింద సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్రంలోని కోటి మంది మహిళలను కోటీశ్వరులు చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని అన్నారు. ఇప్పటి వరకు మూడు విడుతల్లో ఎస్‌హెచ్‌జీలకు వడ్డీ లేని రుణాలు పంపిణీ చేశామని తెలిపారు. జిల్లాలోని 8 వేల 871 స్వయం సహాయక మహిళా సంఘాలకు రూ. 8 కోట్ల 12 లక్షలు లబ్దిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ అయ్యాయని ఆయన వెల్లడించారు.

మహిళల ఆర్థిక ప్రగతితో రాష్ట్రాభివృద్ధి సాధ్యం..

మహిళల ఆర్థిక ప్రగతితో రాష్ట్రాభివృద్ధి సాధ్యమనే ఉద్దేశ్యంతో ప్రతి ప్రభుత్వ పథకంలో మహిళలను భాగస్వామ్యులను ప్రభుత్వం చేస్తుందని ఇన్‌చార్జి కలెక్టర్ గరిమా అగ్రవాల్ సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పన, మరమ్మతుల పనులు అమ్మ ఆదర్శ పాఠశాల కింద మహిళా సంఘాలకు అందించామని, ఇందిరమ్మ ఇళ్లు మహిళల పేరిట ఇస్తుందని, కొనుగోలు కేంద్రాలు, ఇతర వ్యాపారాలకు అవకాశం కల్పించిందని తెలిపారు. ఈ సమావేశంలో మార్కెట్ కమిటీ చైర్మన్‌లు రొండి రాజు, చెలకల తిరుపతి జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు భాగ్య, ఆర్డీవో రాధాబాయి, డీఆర్డీవో శేషాద్రి తదితరులు ఉన్నారు.

● ఇల్లంతకుంట : మండలంలోని మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాల చెక్కులను అందించారు. నియోజకవర్గకేంద్ర కార్యాలయంలో మంగళవారం మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ఆదేశాల ప్రకారం 907సంఘాలకు రూ 97లక్షల చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఎమ్‌సీ వైస్ చైర్మన్ ప్రసాద్, ఏపీఎం లతామంగేశ్వరి, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

గోదాం కాదు.. ప్లాస్టిక్ వ్యర్థాల సేకరణ కేంద్రం



ప్లాస్టిక్ వ్యర్థాల సేకరణ కేంద్రంలో పడి ఉన్న గోనె సంచులు

ఎల్లారెడ్డిపేట, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం హరిదాస్‌నగర్ గ్రామశివారులో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్లాస్టిక్ వ్యర్థాల సేకరణ కేంద్రం అధికారుల పర్యవేక్షణ లేక నిరుపయోగంగా మారింది. దాంతో ఇటీవల రైతుల ధాన్యం కొనుగోలు కేంద్రానికి సరఫరా అయిన గోనె సంచులను నిర్వాహకులు ఇలా ఉంచారు. కొనుగోళ్లు పూర్తయిన గోనె సంచులను అలాగే పడేశారు. ప్లాస్టిక్ వ్యర్థాల కేంద్రం గోదాంగా తయారైందని స్థానిక ప్రజలు పేర్కొన్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు నిర్లక్ష్యం వీడి గోనె సంచులను తొలగించడంతో పాటు ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణ కేంద్రంపై దృష్టి సారించాలని కోరుతున్నారు.

గన్నీసంచుల వ్యవహారంపై విచారణ

ఇల్లంతకుంట, నవంబరు 25(ఆంధ్రజ్యోతి) : మండలకేంద్రంలోని సహకార సంఘంలో గన్నీసంచుల వ్యవహారంలో జరిగిన నష్టంపై విచారణ జరిగింది. కార్యాలయంలో మంగళవారం జిల్లా సహకార అసిస్టెంట్‌రిజిస్ట్రార్ లచ్చయ్య వివరాలు సేకరించారు. ధాన్యం కొనుగోలు సందర్భంగా సంఘానికి వచ్చిన కమీషన్ రూ 95లక్షల గన్నీసంచుల నష్టం జరిగిందని డైరెక్టర్లు గతంలో ఫిర్యాదు చేశారు. కార్యాలయంలో డైరెక్టర్లు గన్నారం వసంతనర్సయ్య, చల్లా నవీన్‌రెడ్డి, మాజీ డైరెక్టర్ నాయిని నవీన్‌కుమార్‌లు విచారణ అధికారిని కలిసి వివరాలు అందించారు.

రోడ్డు పనులు ప్రారంభం

చందుర్తి, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని మూడపల్లి-ఎన్గల్ రోడ్డు నిర్మాణానికి గ్రావెల్ పనులను మార్కెట్ కమిటీ చైర్మన్ చెల్కల తిరుపతి, వైస్ చైర్మన్ బొజ్జ మల్లేశం మంగళవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ రాధ, ఎంపిఒ ప్రదీప్ కుమార్, మాజి జడ్పిటిసి సభ్యుడు నాగం కుమార్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చింతపంటి రామస్వామి, నాయకులు పుల్కం మోహన్, లచ్చయ్య, రవిందర్‌రెడ్డి, ఏసుదాసు, తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల పరిశీలన

చందుర్తి నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : చందుర్తి మండలం మూడపెల్లి గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇండ్లను కాంగ్రెస్ పార్టీ నాయకులు మంగళవారం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో రుద్రంగి మార్కెట్ కమిటీ చైర్మన్ చెలకల తిరుపతి, వైస్ చైర్మన్ బొజ్జ మల్లేశం మాజీ జడ్పిటిసి సభ్యుడు నాగం కుమార్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చింతపంటి రామస్వామి, నాయకులు రవీందర్‌రావు, రవి, లచ్చయ్య, ఏసుదాసు, తదితరులు పాల్గొన్నారు.

చెక్కుల పంపిణీ

ఎల్లారెడ్డిపేట, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్, రాచర్లగుండారం, రాచర్లగొల్లపల్లి గ్రామాల్లోని లబ్దిదారులకు మంజూరైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను ఏఎంసీ చైర్‌పర్సన్ సబేరాబేగం మంగళవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు నర్సయ్య, మహేందర్, గౌస్, నారాయణరెడ్డి, మల్లారెడ్డి, రాజేందర్, భాస్కర్, రాజునాయక్, నరేశ్, బాపురావు, సత్తయ్య, శ్రీనివాస్, శ్రీనివాస్‌రెడ్డి, సాహెబ్, రాజేశం, సాయి, బాబయ్య, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను పరిశీలించిన అదనపు కలెక్టర్



ముస్కానిపేటలో నిర్వాహకులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

ఇల్లంతకుంట, నవంబరు 25(ఆంధ్రజ్యోతి) : వరిధాన్యం కొనుగోళ్ళను వేగవంతం చేయాలని అడీషినల్ కలెక్టర్ నగేష్ సూచించారు. మండలంలోని పొత్తూరు, నర్సక్కపేట, ముస్కానిపేట గ్రామాలలో కొనసాగుతున్న వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను మంగళవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతు కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఇబ్బందులు కలుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఫారూఖ్, సీసీ రాజేశ్వరి, రైతులు ఉన్నారు.

ఆయిల్ పామ్ సాగుపై దృష్టి సారించాలి

బోయినపల్లి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : రైతులు ఆయిల్ పామ్ పంట సాగుపై దృష్టి సారించాలని అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ సూచించారు. బోయినపల్లి తహసీల్ కార్యాలయాన్ని అదనపు కలెక్టర్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా భూ భారతిలో భాగంగా ఎన్ని దరఖాస్తులు వచ్చాయో ఆరా తీశారు. అనంతరం స్తంభంపల్లి, అనంతపల్లి, కోరెం, తడగొండ, బోయినపల్లి, కొదురుపాక, మానువాడ గ్రామాల్లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ పరిశీలించి, నిర్వాహకులకు సూచనలు చేశారు. ఆయన వెంట తహసీల్దార్ నారాయణ రెడ్డి తదితరులు ఉన్నారు.

డీసీసీ అధ్యక్షుడిని కలిసిన నాయకులు

చందుర్తి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): చందుర్తి మండల కాంగ్రెస్ నాయకులు సిరిసిల్లలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్‌ను మంగళవారం కలిశారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షునిగా శ్రీనివాస్ బాధ్యతలు చేపట్టిన సందర్భంగా సన్మానించారు. మాజీ జడ్పిటిసి సభ్యుడు నాగం కుమార్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బొజ్జ మల్లేశం, కాంగ్రెస్ నాయకులు ధర్మపురి శ్రీనివాస్, రవీందర్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, ఏసుదాసు, మల్లేశం, గణేష్, ఆదిత్య రెడ్డి, రవి ఉన్నారు.

● బోయినపల్లి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) రాజన్న సిరిసిల్ల జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా ఇటీవల నియమకమైన సంగీతం శ్రీనివాస్‌ను బోయినపల్లి మండల కాంగ్రెస్ నాయకులు మంగళవారం సిరిసిల్లలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు ఏనుగుల కనకయ్య, బోయినిపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వన్నెల రమణారెడ్డి, మాజీ ఎంపీటీసీ సంబ లక్ష్మీరాజం తదితరులు ఉన్నారు.

31 మందికి కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు

వేములవాడ, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): వేములవాడ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో 31మందికి ఉచిత కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలు నిర్వహించారు. కుటుంబ నియంత్రణ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం ప్రభుత్వ ఆసుపత్రిలో 31మందికి కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేపట్టారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పెంచలయ్య, వైద్యులు రమేష్, సంపత్ కుమార్, దివ్య ఉన్నారు.

ఉచిత వైద్య శిబిరం

ఎల్లారెడ్డిపేట, నవంబరు25(ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆర్‌బీఎస్, జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో మంగళవారం ఉచి త వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. వైద్యులు సాయిచంద్ర, సంధ్యారాణిలు విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. మందులను పంపిణీచేశారు. ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగాం ఇన్‌చార్జి గంగాధర్, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సత్యనారాయ ణ, అధ్యాపకులు పర్శరాములు, విష్ణుప్రసాద్, రవిచంద్ర, భూమక్క, కవిత, సౌమ్య, గౌతమి, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

● తంగళ్లపల్లి, : తంగళ్లపల్లి మండలం ఇందిరమ్మ కాలనీలో గిరిజన గురుకుల పాఠ శాలలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. జిల్లా వైద్యాధికారి సూచన మేరకు మంగళవారం తంగళ్లపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి మం దులు పంపిణీ చేశారు. విద్యార్థులు వ్యక్తిగత శుభ్రత పాటించాలని పరిశుభ్రతపై అవగాహన కల్పించారు.

ఉత్సాహంగా పీఎం క్రీడా పోటీలు

సిరిసిల్ల టౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని గీతనగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం బాలబాలికల క్రీడా పోటీలు ఉత్సాహంగా ఉల్లాసంగా జరగాయి. రెండు రోజుల పాటు జరిగే పీఎం పాఠశాల స్థాయి క్రీడలను పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శారద ప్రారంభించారు. మొదటి రోజు బాలబాలికలకు వేరు వేరుగా కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయుడు తడుకల సురేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలి..

తంగళ్లపల్లి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): కస్తూర్బా గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ జిల్లా హాస్టల్స్ కన్వీనర్ పూజ్యం కార్తీక్ డిమాండ్ చేశారు. మంగళవారం తంగళ్లపల్లి మండలం పద్మనగర్ శివారులోని కస్తూర్బా గురుకుల పాఠశాల ముందు ఏబీవీపీ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థులు ఇబ్బందులు గురవుతున్నారని ఆరోపించారు.

29న హుండీ లెక్కింపు

ఇల్లంతకుంట, నవంబరు 25(ఆంధ్రజ్యోతి) మండలంలోని అనంతగిరి గ్రామ ముత్యాల పోచమ్మ ఆలయ హుండిని ఈనెల 29న లెక్కిస్తున్నట్లు ఈవో మారుతిరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆలయ ఆవరణలో లడ్డు, పులిహోర అమ్మకం, కొబ్బరి ముక్కలను ప్రొగుచేసుకోవడానికి డిసెంబర్ 3న బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వేలంపాట ద్వారా హక్కులు పొందిన వారు సంవత్సరంపాటు హక్కులుంటాయని తెలిపారు.

ఆలయాభివృద్ధికి వితరణ

ఇల్లంతకుంట, నవంబరు 25(ఆంధ్రజ్యోతి) మండలకేంద్రంలోని అయ్యప్పస్వామి ఆలయ అభివృద్ధికి దాతలు మంగళవారం వితరణ చేశారు. ఇల్లంతకుంట మాజీ సర్పంచ్ చిట్టి రాంరెడ్డి కుమార్తెలు కళ్యాం నిర్మలరతేందర్‌రెడ్డి, రెడ్డి అమలబాల్‌రెడ్డి, పాతూరి రాజశ్వేరి వెంకటేశ్వర్‌రెడ్డి, వడియాల శ్రీదేవిరవీందర్‌రెడ్డి, నల్ల కపిలవిజయ్‌రెడ్డిలు అయ్యప్పస్వామి ఆలయ ప్రాంగణంలో గ్రానైట్ వేయడానికి రూ లక్షా 20వేల 118 అందించారు.

చెరుకు పంట దగ్ధం

బోయినపల్లి నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని స్తంభంపల్లి గ్రామానికి చెందిన పులి లక్ష్మిపతి గౌడ్ చెందిన ఐదు ఎకరాల చెరుకు పంట ప్రమాదవశాత్తు అగ్నికి దగ్ధం అయింది. దీంతో రైతుకు దాదాపు ఐదు లక్షల నష్టం వాటిల్లింది.

సంక్షేమ హాస్టల్ విద్యార్థుల సమస్యలు తీర్చడంలో ప్రభుత్వం విఫలం

మాజీ ఎమ్మెల్యే రసమయి



విద్యార్థులకు దుప్పట్లను పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే

ఇల్లంతకుంట, నవంబరు 25(ఆంధ్రజ్యోతి) : సంక్షేమ హస్టళ్లలో నెలకొన్న సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం చెందిందని మానకొండూర్ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ పేర్కొన్నారు. మండలంలోని గాలిపెల్లి గ్రామంలోని బీసీ బాలుర, ఇల్లంతకుంటలోని ఎస్సీ బాలుర హస్టళ్ళ విద్యార్థులకు మంగళవారం గిఫ్ట్ ఏస్మైల్ కార్యక్రమం క్రింద దుప్పట్లను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని అన్ని హాస్టల్స్‌లో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. విద్యాసంవత్సరం ప్రారంభం అయి నెలలు గడిచిపోతున్నా ఇంతవరకు విద్యార్థులకు కనీసం దుప్పట్లు పంపిణీ చేయలేదన్నారు. అనంతరం ఇల్లంతకుంటలో పలువురిని పరామర్శించారు. జడ్పీమాజీ వైస్ చైర్మన్ సిద్దం వేణు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పల్లె నర్సింహ్మారెడ్డి, నాయకులు ఒగ్గు నర్సయ్యయాదవ్, దేవరెడ్డి, సాదుల్, మీసరగండ్ల అనీల్‌కుమార్, సావనపెల్లి అనీల్‌కుమార్, కూనబోయిన రఘు, బట్టు విజయ్, ప్రశాంత్‌రెడ్డి, శ్రీనివాస్, సలీం, అంతగిరి భాస్కర్, కళ్యాణం నర్సయ్య, దొంతుల శంకర్, కొట్టె వెంకన్న, మామిడి తిరుపతి పాల్గొన్నారు.

బీసీలను మోసం చేసిన కాంగ్రెస్ పార్టీకి గుణపాఠం చెప్పాలి

- జడ్పీ మాజీ వైస్ చైర్మన్ సిద్దం వేణు

ఇల్లంతకుంట, నవంబరు 25(ఆంధ్రజ్యోతి) : బీసీల రిజర్వేషన్లు పెంచుతామని మోసం చేసిన కాంగ్రెస్‌పార్టీకి తగిన గుణపాఠం చెప్పాలని జడ్పీమాజీ వైస్ చైర్మన్ సిద్దం వేణు పేర్కొన్నారు. మండలకేంద్రంలో మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అసమగ్ర కుల గణన వివరాలతో స్థానిక ఎన్నికలలో బీసీలను నట్టేట ముంచారని విమర్శించారు. కామారెడ్డి డిక్లరేషన్ ఒక బూటకం అని విమర్శించారు. తెలంగాణ ప్రభుత్వం జారీచేసిన 46జీవోను రద్దు చేసి మరల కొత్త గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయాలన్నారు. మండలంలోని వెంకట్రావుపల్లె గ్రామంలో 80శాతం మంది బీసీలు ఉన్నప్పటికిని రాజకీయ పలుకుబడితో కొందరు వ్యవహరించి ఒక్కవార్డు కూడా బీసీలకు రిజర్వ్ కాకుండా చేశారని పేర్కొన్నారు. తిప్పాపూర్ గ్రామ పరస్థితి కూడా ఇదేవిదంగా ఉందన్నారు. ఉన్నతస్థాయి అధికారులు మరోసారి సమీక్షించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మాజీ ఎంపీటీసీ ఒగ్గు నర్సయ్యయాదవ్, నాయకులు కూనబోయిన రఘు, సాదుల్, కొట్టె వెంకన్న, అంతగిరి భాస్కర్, సలీం, నర్సయ్య పాల్గొన్నారు.

పాఠశాల చుట్టూ ప్రహరీ నిర్మించరూ..



ప్రహరీ లేకుండా ఉన్న పాఠశాల భవనం

ముస్తాబాద్, నవంబర్ 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సేవాలాల్ తండా పరిధిలోని రాగంవాళ్ల కాలనీలోగల ప్రాథమిక పాఠశాల భవనం చుట్టూ ప్రహరీ లేక ప్రమాదకరంగా మారింది. ప్రాథమిక పాఠశాల భవనం పక్కన, వెనకభాగాన పెద్దగోతులు తీయడంతో ప్రమాదకరంగా మారింది. విద్యార్థులు ఆటలాడుకునే సమయంలో ప్రమాదం జరిగే అవకాశం ఉంది. అధికారులు స్పందించి ప్రహరీ నిర్మాంచాలని కోరుతున్నారు.

'పల్లె పోరు'కు మోగిన నగారా..

(5వ పేజీ తరువాయి)

నిర్వహణకు బ్యాలెట్ బాక్సులు, నోడల్ అధికారుల నియామకం, ఆర్వోలు, పివోలు, ఏపీవోలకు రెండు విడతలుగా శిక్షణ కార్యక్రమాలు చేపట్టారు. సర్పంచ్‌లకు గులాబీ రంగు, వార్డు మెంబర్లకు తెలుపు రంగు బ్యాలెట్ పేపర్లు ముద్రించడానికి సిద్ధం చేశారు.

షెడ్యూల్‌తో పల్లెల్లో హడావిడి

జిల్లాలో మూడు విడతల్లో పంచాయతీ ఎన్నికల నిర్వహణకు ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకటించడంతో పల్లెల్లో రాజకీయ పార్టీల హడావిడి మొదలైంది. ఆశావహులు కూడా తమ గెలుపుకోసం ప్రయత్నాలను ముమ్మరం చేసుకుంటున్నారు. పార్టీల గుర్తులు లేకపోయినా ఆ పార్టీ మద్దతు కీలకంగా ఉంటుంది. ఈ దశలో ఆయా పార్టీల పెద్దల మద్దతు కోసం తహతహలాడుతున్నారు.

సంక్షిప్త సమాచారం

● కోనరావుపేట : పిల్లల్లో అభ్యసన సామర్థ్యాలను పెంచాలని మండల విద్యాధికారి మురళీనాయక్ కోరారు. మంగళవారం ధర్మారం ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన జీవశాస్త్ర కాంప్లెక్స్ సమావేశానికి హాజరై మాట్లాడారు. ఆర్పీలు తిరుపతిరెడ్డి, వెంకట్రాంరెడ్డి, జీవశాస్త్ర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● కోనరావుపేట : ధర్మారం ప్రభుత్వ పాఠశాలలో ఎంపీ నిధులతో వేసిన బోరుబావిని ఎంఈవో మురళి నాయక్‌తో కలిసి ప్రారంభించారు. బీజేపీ మండల అధ్యక్షుడు మిర్యాల్‌కర్ బాలాజీ, నాయకులు పురుషోత్తమరావు, వెలిశాల రవీం దర్, విజయ్, అభిషేక్, గోపాల్‌రావు సాయి తదితరులు ఉన్నారు.

● ఇల్లంతకుంట : మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో మంగళవారం వైద్యాధికారి జీవనజ్యోతి నేతృత్వంలో టీబీ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్ఎల్‌హెచ్‌పీ డాక్టర్లు మౌనిక, రసజ్ఞ, తారాభాయి, జవహర్, వెంకటరమణలతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

● వీర్నపల్లి(ఎల్లారెడ్డిపేట) : పంచాయతీ రిజర్వేషన్లలో మండలంలోని 17 పంచాయతీలకు ఒక్క స్థానం కూడా బీసీలకు దక్కలేదని, స్పందించి కేటాయించాలని కోరుతూ వీర్నపల్లి మండలంలోని నాయకులు మంగళవారం సిరిసిల్ల ఆర్డీవో వెంకటేశ్వర్లుకు విన్నవించారు. సెస్ డైరెక్టర్ మల్లేశం, నాయకులు సురేశ్‌నాయక్, చాంద్‌పాషా, రాజిరెడ్డి, అరుణ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

●ఇల్లంతకుంట : మండలకేంద్రంలోని వైశ్యభవనంలో అలయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో వాసుదేవ ఆసుపత్రి సహకారంతో మెగా వైద్యశిబిరం జరిగింది. క్లబ్ మండలశాఖ అధ్యక్షుడు అల్లాడి ఆనంద్‌కుమార్, ఎస్సై సిరిసిల్ల అశోక్, ఇంటర్నేషనల్ అడ్వయిజర్ ఎలగందుల శ్రీనివాస్, కొంజర్ల మహేష్, వైద్యాధికారులు సాయి, మేఘన, వర్ష, స్పోర్ట్స్‌క్లబ్ అధ్యక్షుడు మామిడి రాజు పాల్గొన్నారు.

● ఎల్లారెడ్డిపేట : ఎల్లారెడ్డిపేట మండలం హరిదాస్‌నగర్‌లో రూ.12లక్షలతో తలపెట్టిన మురుగు నీటి కాల్వ నిర్మాణానికి స్థానిక కాంగ్రెస్ నాయకులు మంగళవారం భూమి పూజ చేశారు. రామచంద్రం, మల్లారెడ్డి, పర్శరాములు, సురేందర్, రాములు తదితరులు పాల్గొన్నారు.

● గంభీరావుపేట : గంభీరావుపేట మండలం రాజేశ్వర్‌రావునగర్ కాలనీలో మంగళవారం ఇందిరమ్మ చీరలను పంపిణీ చేశారు. కాంగ్రెస్ సీనియర్ నాయకులు పిట్ల వెంకటి తదితరులు పాల్గొన్నారు.

● తంగళ్లపల్లి : సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికలకు కార్యకర్తలు సన్నద్ధం కావాలని బీజేపీ మండల అధ్యక్షుడు వెన్నమనేని శ్రీధర్‌రావు పిలుపునిచ్చారు. మంగళవారం బీజేపీ కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. నాయకులు కోల అంజనేయులు, కాసిగంటి రాజురావు, ఇటికల రాజు, కోసిని వినయ్ యాదవ్, రెడ్డిమల్ల ఆశార్వాద్ తదితరులు పాల్గొన్నారు.

● గంభీరావుపేట : బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని పేర్కొన్న కాంగ్రెస్ పంచాయతీ ఎన్నికల్లో 22 శాతం అమలుచేసి బీసీలను వంచించాలని చూస్తే సహించబోమని బీజేపీ నాయకుడు, బీసీ జేఏసీ కో-కన్వీనర్ కొక్కు దేవేందర్‌యాదవ్ హెచ్చరించారు. మండల కేంద్రంలో మంగళవారం ఆయన మాట్లాడారు. ప్రభుత్వం రిజర్వేషన్లపై పునరాలోచన చేసి న్యాయం చేయాలని దేవేందర్‌యాదవ్ కోరారు.

● వేములవాడ : వేములవాడ పట్టణంలో నిర్వహించిన ఎస్ఆర్ఆర్ క్రికెట్ ప్రీమియర్ లీగ్-5 మ్యాచ్ ముగింపు వేడుకలకు జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు పూర్మనీ లింగారెడ్డి హాజరయ్యారు. ఫైనల్‌లో గెలుపొందిన జంతోష్ వారియర్స్ జట్టుకు రన్నర్‌గా నిలిచిన సాగర్ టీమ్‌కు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజర్స్ క్రికెటర్లు తదితరులు ఉన్నారు.

●తంగళ్లపల్లి : మండల కేంద్రంలో స్వయంభూ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు డిసెంబర్ 3 నుంచి ప్రారంభమవుతయాని వాస్తు జ్యోతిష్య పండితులు నమిలికొండ రమణాచారి తెలిపారు. మంగళవారం బ్రహ్మోత్సవాల కరపత్రాన్ని(ఆహ్వాన) పండితులు, ఆలయ కమిటీ సభ్యులు ఆవిష్కరించారు.

కలెక్టరేట్ ఎదుట భవన నిర్మాణ కార్మికుల ధర్నా

- వెల్ఫేర్ బోర్డు నుంచే ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించాలని డిమాండ్

సిరిసిల్ల కలెక్టరేట్, నవంబర్ 25 (ఆంధ్రజ్యోతి) : వెల్ఫేర్ బోర్డు ద్వారానే భవన నిర్మాణ కార్మికులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందించడంతోపాటు జీవో 12ను సవరించాలని సీఐటీయూ భవన నిర్మాణ కార్మిక రంగం ప్రధాన కార్యదర్శి ఎగమంటి ఎల్లారెడ్డి, అధ్యక్షుడు గీస బిక్షపతిలు డిమాండ్ చేశారు. సీఐటీయూ తెలంగాణ భవన నిర్మాణ సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ పిలుపు మేరకు మంగళవారం సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్ ఎదుట సీఐటీయూ భవన నిర్మాణ కార్మిక రంగం జిల్లా కమిటి అధ్వర్యంలో కార్మికులతో కలిసి నాయకులు ధర్నా చేసి కార్మిక శాఖ అధికారి నజీర్ అహ్మద్‌కు వినతి పత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు గురిజాల శ్రీధర్, కోల శ్రీనివాస్, సావనపల్లి ప్రభాకర్, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు, కార్మికులు

ఏఐటీయూసీ ఆధ్వర్యంలో...

భవన నిర్మాణ సంక్షేమ బోర్డును కాపాడడంతోపాటు జీవో 12ను రద్దు చేయాలంటూ కలెక్టరేట్ ఎదుట మంగళవారం ఏఐటీయూసీ తెలంగాణ బిల్డింగ్, కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ అధ్వర్యంలో కార్మికులతో కలిసి నాయకులు ధర్నాచేశారు. ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కడారి రాములు, అజ్జ వేణు, వడ్డెపల్లి లక్ష్మణ్, కొరెపు శ్రీనివాస్, కుమ్మరి కొంరయ్య, పండుగ చంద్రయ్య, రవిచారి, రాడం బాబు, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లను కేంద్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలి

- ఏఐఎఫ్‌టీయూ(న్యూ) నాయకుల నిరసన



నిరసన తెలుపుతున్న నాయకులు

సిరిసిల్ల టౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : నాడు పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను తొలగించి ప్రస్తుతం కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను ఉపసంహరించుకోవాలని ఏఐఎఫ్‌టీయూ(న్యూ) రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సోమిశెట్టి దశరథం డిమాండ్ చేశారు. రైతు వ్యతిరేక మూడు వ్యవసాయ చట్టాల తరహాలోనే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఏఐఎఫ్‌టీయూ (న్యూ)జిల్లా శాఖ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కేంద్రం అంబేద్కర్ చౌరస్తా వద్ద నాయకులు వినూత్న నిరసన చేపట్టారు. కేంద్ర ప్రభుత్వం తలలేని పనులను చేస్తుందని విమర్శిస్తూ కుండతో తయారుచేసిన కేంద్ర ప్రభుత్వ తలను పగలగొట్టి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా దశరథం మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎర్రజెండా బీడీ కార్మిక సంఘం జిల్లా కన్వీనర్లు మచ్చ అనుసూయ, జక్కని త్రివేణి, ఏఐఎఫ్‌టీయూ (న్యూ) నాయకులు గుజ్జె దేవదాస్, వేముల రాజేశం, బి ఎల్లయ్య, చేరాల బాలరాజ్, ఉట్కాల చంద్రమౌళి పాల్గొన్నారు.

30 నుంచి సిరిసిల్లలో రాష్ట్ర స్థాయి జూనియర్స్ వాలీబాల్ పోటీలు

సిరిసిల్ల టౌన్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి) : సిరిసిల్లలో ఈనెల 30 నుంచి రాష్ట్రస్థాయి జూనియర్స్ బాలబాలికల పోటీలను నిర్వహి స్తున్నామని జిల్లా వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షుడు చెన్నమనేని శ్రీకుమార్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రం ప్రెస్‌క్లబ్‌లో విలే కరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వాలీబాల్ క్రీడాకారులను ప్రోత్సహిస్తూ మరోసారి జిల్లా కేంద్రంలోని మినీ స్టేడియంలో ఈనెల 30 నుంచి డిసెంబరు 3వ తేది వరకు (నాలుగు రోజులు)రాష్ట్ర స్థాయి జూనియర్స్ వాలీబాల్ బాలబాలికల పోటీలను నిర్వహించడం కోసం ఏర్పాట్లు జరుగుతున్నాయన్నా రు. పోటీలలో ఉమ్మడి జిల్లాల నుంచి బాలు రు 10, బాలికలు 10 జట్లు పాల్గొంటున్నాయన్నారు. క్రీడాకారులకు, అఫిషియల్స్‌కు ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీని వాస్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్, ఇన్‌చార్జి కలె క్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి. గితే, కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గం ఇన్‌చార్జి కేకే మహేందర్ రెడ్డి, టౌన్‌క్లబ్ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్ ఆహ్వానిస్తున్నామన్నారు. ఇతర అధికారులు, ఇతర నాయకులను ఆహ్వానిస్తామన్నారు. సమావేశంలో జిల్లా వాలీబాల్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు చింతికింది శ్యాంకుమార్, కోశాధికారి కోడం శ్రీనివాస్, గౌరవ అధ్యక్షుడు గుడ్ల రవి, సంయుక్తకార్యదర్శులు దర్శనాల రామస్వామి, మాదాసు లక్ష్మణ్ పాల్గొన్నారు.

సమర్థవంతంగా బాధ్యతలు నిర్వహించాలి

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



బాధ్యతలను స్వీకరిస్తున్న సంగీతం శ్రీనివాస్

సిరిసిల్ల టౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా బాధ్యతలను సమర్థవంతంగా పోషించడానికి కొన్ని సవాలు ఎదురు అవుతాయని వాటిని సమర్థవంతగా ఎదుర్కోవాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. మంగళ వారం జిల్లా కేంద్రం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ప్రభుత్వ విప్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షుడిగా ఎంపికైన సంగీతం శ్రీనివాస్‌కు జిల్లా కాంగ్రెస్ అధ్యక్ష బాధ్యతలను ఆది శ్రీనివాస్ అందించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతం నిర్మాణంలో జిల్లాలో తనకు సహకరించిన అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా సంక్షేమ పథాకాలను పేదలకు అందించడానికి మరింత కృషి చేయాలన్నారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్ మాట్లాడారు. జిల్లాలో సామాన్య కార్యకర్తగా 40 సంవత్సరాలుగా పార్టీకి పనిచేసిన తనను పార్టీ గుర్తించినందుకు జీవితాంతం రుణపడి ఉంటానన్నారు. పార్టీ మరింత బలోపేతానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ నాగుల సత్యనారాయణ, సిరిసిల్ల పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్, ఉపాధ్యక్షుడు బొప్ప దేవయ్య, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సూర దేవరాజు, పీసీసీ మాజీ కార్యదర్శి గడ్డం నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.